తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice · వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

26-04-2026

ఆదివారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 86

PUBLISHED FROM HYDERABAD · పేజీలు-8 · వెల:రూ.4 /–


## హైటెన్షన్ రోడ్డు ప్రయాణానికి ఫుల్ టెన్షన్

- రోడ్డు వెడల్పు పనుల్లో తాత్సారం నెలల కొద్దీ సాగుతున్న పనులు.
- నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు
- ఆల్వాల్ ప్రజలకు నరకప్రయాణం ప్రధాన రహదారికి ఈ రోడ్డే మార్గం



4




## ఎంతయినా ఒరిజినల్ ఒరిజినలే

కవిత పార్టీపై బీఆర్ఎస్ సెటైర్లు

అసలు ఒరిజినలే లేదుగా అంటూ టీఆర్ఎస్ ప్రతిదాడి

.. వివరాలు 3లో



## కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు

తెలంగాణలో వచ్చిదే బీజేపీయే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

.. వివరాలు 3లో



## తండ్రి పిట్టల దొర బిడ్డ పిట్టల దొరసాని

కవితకు రాజకీయ సమాధి కట్టిందే బీజేపీనే మీడియా సమావేశంలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్

.. వివరాలు 3లో




### కవిత కొత్త పార్టీ

# టీఆర్ఎస్

## ‘తెలంగాణ రాష్ట్ర సేన’ను ప్రకటించిన కవిత

### పార్టీ పేరు, జెండా, ఎజెండా వెల్లడి

### మూడు ప్రధాన పార్టీలే లక్ష్యంగా విమర్శలు

### సామాజిక తెలంగాణే ధ్యేయం..

### ప్రజల కోసం ‘టీఆర్ఎస్’ పునరాగమనం

**హైదరాబాద్, ఏప్రిల్ 25 (సిరి న్యూస్):** తెలంగాణ రాజకీయ యవనికపై శనివారం ఒక కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించింది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన నూతన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభిస్తూ ‘తెలంగాణ రాష్ట్ర సేన’ పార్టీని ప్రకటించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆమె పార్టీ పేరు, జెండా, ఎజెండాను వెల్లడించారు. రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు (బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ) ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమయ్యా యని, అందుకే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆమె స్పష్టం చేశారు. సభను ఉద్దేశించి కవిత ప్రసంగిస్తూ.. తెలంగాణ కోసం పిడి కిలి బిగించి కొట్లాడిన వారంతా నేడు మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. “బీఆర్ఎస్ పదేళ్ల అవినీతి, కాంగ్రెస్ మోసం,

మిగతా 3 లో



## సీఎం అవుతా..

గన్‌పార్క్ వద్ద అమరవీరులకు కవిత నివాళి

కొత్త విప్లవానికి నాంది అన్న టీఆర్ఎస్ అధినేత్రి


### రాష్ట్రంలో ‘కర్కోటకుడి’ పాలన

ముఖ్యమంత్రి రేవంత్‌పై కవిత నిప్పులు!

3

# అంతరిక్షంలో హైదరాబాద్ కీర్తి

### శ్రీహరికోటకు ‘విక్రమ్-1’ పయనం



జెండా ఊపి సాగనంపిన సీఎం రేవంత్ రెడ్డి

దేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్

శంషాబాద్ స్కైరూట్ సంస్థలో సందడి

### త్వరలోనే నింగిలోకి ‘విక్రమ్’

అది శంషాబాద్‌లోని ఒక రహస్య ప్రయోగశాల.. అక్కడ నెలకొన్న నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఒక భారీ వాహనం కదిలింది. చూడటానికి సాదాసీదాగా కనిపిస్తున్నా, దాని గర్భంలో కొన్ని వందల కిలోల బరువును అంతరిక్షంలోకి మోసుకెళ్లే అద్భుత శక్తి దాగి ఉంది. భారతదేశపు అంతరిక్ష చరిత్రలో ఒక ప్రైవేట్ సంస్థ సాగించబోతున్న అతిపెద్ద సాహసానికి ఆ వాహనమే నాంది. అదే హైదరాబాద్ గడ్డపై ప్రాణం పోసుకున్న ‘విక్రమ్-1’. నిన్నటి వరకు ప్రయోగశాలకే పరిమితమైన ఈ రాకెట్, ఇప్పుడు అనంత విశ్వంలోకి దూసుకెళ్లేందుకు తన మొదటి అడుగు వేసింది. శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చజెండా ఊపి సాగనంపడంతో, ఈ రాకెట్ తన లక్ష్యస్థానమైన శ్రీహరికోట వైపు ప్రయాణాన్ని ప్రారంభించింది.

## అజారుద్దీన్, కోదండ రామ్‌కు ఊరట

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు గ్రీన్ సిగ్నల్

2



## నేటి నుంచే ‘డిజిటల్’ జనగణన

మీ వివరాలు మీరే నమోదు చేసుకోవచ్చు!

మే 10 వరకు సెల్ఫ్-ఎన్యుమరేషన్‌కు అవకాశం..

వెబ్ పోర్టల్‌ను ప్రకటించిన భారతీ హొళికెరి

తెలంగాణలో తొలిసారి కులగణన..

ఇంటింటికీ రానున్న ఎన్యుమరేటర్లు

## మరో 47మంది అజ్ఞాత మావోల లొంగుబాటు

### ఇంకా అజ్ఞాతంలోనే గణపతి తదితరులు

తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



## ఆర్టీసీ బలోపేతమే లక్ష్యం



2

సమ్మె సమయంలో కార్మికులతో చర్చించి పరిష్కరించగలిగాం

ప్రజాప్రతినిధులతో జూమ్ కాల్‌లో చర్చించిన మంత్రి పొన్నం

## క్షేత్ర స్థాయిలో కరంటు బాస్ ..



4

సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యం.

సంస్థ అభివృద్దే ముఖ్యం

నూతన పంథాకు అటు కార్మికులు ఇటు నెటిజనులు ఫిదా!


## దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

పలు రాష్ట్రాలకు ‘వడగాల్పుల’ హెచ్చరిక

ఏప్రిల్ నుంచి జూన్ వరకు తీవ్ర ప్రభావం

రాత్రిపూట వీస్తున్న వేడి గాలులు

4





## హర్మూజ్‌లో అమెరికా సైనిక ఆంక్షలు

అణ్వాయుధ కార్యక్రమాలు వీడే వరకు సైనిక ఒత్తిడి తప్పదు

.. వివరాలు 4లో



# అజారుద్దీన్, కోదండ రామ్‌కు ఊరట

**గవర్నర్ కోటా ఎమ్మెల్సీలకు గ్రీన్ సిగ్నల్**

**(సిరి న్యూస్) హైదరాబాద్, ఏప్రిల్ 25:** గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకానికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన అజారుద్దీన్, కోదండరాం అభ్యర్థిత్వాలకు లైన్ క్లియర్ అయ్యింది. వారిద్దరి అభ్యర్థిత్వాలను ఆమోదిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సంతకం చేశారు. దీనిపై త్వరలో గెజిట్ నోటిఫికేషన్ విడుదల కానుంది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై గత మూడేళ్లుగా వివాదం కొనసాగుతోంది. ఈ నెల 30 లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోనున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలను త్వరగా పరిశీలించాలని గవర్నర్‌ను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రమంత్రి వర్గం ప్రతిపాదించిన పేర్లను ఆమోదిస్తూ గవర్నర్ తాజాగా సంతకాలు చేశారు.

# సీఎంతో పోలీస్ అధికారుల భేటీ



**హైదరాబాద్,ఏప్రిల్25 :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఐసీసీసీలో సీనియర్ పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసారు. డీజీపీ ర్యాంక్ ప్రమోషన్ పొందిన సీనియర్ ఐపీఎస్ అధికారులు వి.వి. శ్రీనివాసరావు, స్వాతి లక్రా, మహేష్ భాగవత్, చారు సిన్హా, డా. అనిల్ కుమార్, వి.సి. సజ్జనార్ లు కలిసి అభినందనలు తెలిపారు. ప్రభుత్వం వీరికి డిజిలుగా ప్రమోషన్లు ఇచ్చింది. దీంతో వీరు సిఎం కలిసారు.

# మెట్రో చైర్మన్‌గా సీఎస్ రామకృష్ణారావు



**(సిరి న్యూస్) హైదరాబాద్,ఏప్రిల్ 25 :** హైదరాబాద్ మెట్రో రైలు వ్యవస్థపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్ భాగస్వామ్య సంస్థ ఎల్ అండ్ టీ చేతిలో ఉన్న వాటాలన్నీ స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏప్రిల్ 30వ తేదీలోగా సుమారు రూ.15 వేల కోట్ల డీల్ పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రానుంది. ఈ మార్పుల నేపథ్యంలో మెట్రో రైల్ బోర్డులో కీలక నియామకాలు కూడా జరిగాయి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావును బోర్డు చైర్మన్‌గా నియమించింది. మెట్రో ఎండీగా సర్ఫరాజ్ అహ్మద్ కొనసాగనున్నారు. అలాగే బోర్డు డైరెక్టర్లుగా జయేశ్ రంజన్, వికాస్ రాజ్, ÷నాన్స్ సెక్రటరీ సుల్తానియా, అలాగే శివధర్ రెడ్డిని తెలంగాణ సర్కార్ నియమించింది. ఈ నిర్ణయంతో హైదరాబాద్ మెట్రో రైల్ నిర్వహణ, విస్తరణ, భవిష్యత్తు ప్రణాళికలు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి రానున్నాయి. షేర్ అలాట్‌మెంట్‌కు కూడా ఆమోదం లభించినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు

**టీటీడీ మాజీ మెంబర్ శివకుమార్‌కు నోటీసులు**



**(సిరి న్యూస్)హైదరాబాద్, ఏప్రిల్25 :** తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ కేసులో సాక్ష్యాధారాల సేకరణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం తాజాగా మరో కీలక వ్యక్తికి నోటీసులు జారీ చేసింది. యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్, టీటీడీ మాజీ సభ్యులైన కె. శివకుమార్ ఈ కేసు దర్యాప్తులో భాగంగా సిట్ విచారణను ఎదుర్కోనున్నారు.ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక సమాచారం సేకరించేందుకు శివకుమార్‌కు అధికారులు నోటీసులు పంపారు. మే 28వ తేదీన విచారణకు హాజరు కావాలని సిట్ అధికారులు ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ విచారణ జరగనుందని సిట్ అధికారులు తెలిపారు. కేసీఆర్ హయాంలో రాజకీయ నేతలు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీల ఫోన్లను ట్యాపింగ్ చేశారనే ఆరోపణలపై ఈ దర్యాప్తు జరుగుతోంది. ఇప్పటికే పలువురు పోలీసు ఉన్నతాధికారులు అరెస్ట్ కాగా, తాజాగా సాక్షుల విచారణలో భాగంగా శివకుమార్‌ను పిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ట్యాపింగ్ బాధితుల్లో శివకుమార్ పేరు ఉందా? లేదా? దీనికి సంబంధించిన ఇతర వివరాలు ఏమైనా ఆయనకు తెలుసా? అనే కోణంలో అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంది. కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను వేదికగా చేసుకుని జరుగుతున్న ఈ విచారణ, ఈ కేసును మరింత సమగ్ర సమాచారాన్ని ఛేదించే దిశగా ఈ విచారణ సాగనున్నట్లు తెలుస్తోంది. మే 28వ తేదీన శివకుమార్ ఇచ్చే స్టేట్‌మెంట్ ఈ కేసులో ఎవరి పాత్రను బయటపెడుతుందో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# అంతరిక్షంలో హైదరాబాద్ కీర్తి

**శ్రీహరికోటకు 'విక్రమ్-1' పయనం**

**జెండా ఊపి సాగనంపిన సీఎం రేవంత్ రెడ్డి..**

**దేశపు తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్**

**శంషాబాద్ స్కైరూట్ సంస్థలో సందడి..**

**త్వరలోనే నింగిలోకి 'విక్రమ్'**



**(సిరి న్యూస్) హైదరాబాద్, ఏప్రిల్ 25 :** భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో సరికొత్త అధ్యాయానికి హైదరాబాద్ వేదికైంది. నగరానికి చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' రూపొందించిన భారతదేశపు మొట్టమొదటి ప్రైవేట్ కమర్షియల్ ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-1' తన అంతిమ ప్రయాణాన్ని ప్రారంభించింది. శనివారం శంషాబాద్ ఏరోస్పేస్ పార్క్‌లోని స్కైరూట్ మ్యాక్స్-క్యూ క్యాంపస్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఈ రాకెట్‌ను జెండా ఊపి శ్రీహరికోటకు పంపారు. ప్రీ-ఫ్లైట్ పరీక్షలన్నింటినీ విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ రాకెట్, తదుపరి ప్రయోగం కోసం నెల్లూరు జిల్లాలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ూనాూ=)కు చేరుకోనుంది.

**స్వదేశీ పరిజ్ఞానం.. అద్భుత సాంకేతికత**

భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాభాయ్ స్మృత్యర్థం 'విక్రమ్-1'గా నామకరణం చేసిన ఈ రాకెట్, పూర్తి స్వదేశీ సాంకేతికతతో 100 శాతం భారతదేశంలోనే తయారైంది. స్కైరూట్ సంస్థను సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాకెట్ తయారీలో వాడిన అత్యాధునిక టెక్నాలజీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాకెట్ తయారీలో కీలక పాత్ర పోషించిన యువ శాస్త్రవేత్తలు, సంస్థ యాజమాన్యాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. హైదరాబాద్ ఒక ఐటీ కేంద్రంగానే కాకుండా, ఇప్పుడు స్పేస్ టెక్నాలజీలోనూ ప్రపంచ స్థాయికి ఎదగడం గర్వకారణమని సీఎం పేర్కొన్నారు.

**తేలికగా.. బలంగా.. 3డీ ప్రింటెడ్ ఇంజన్లతో..**

విక్రమ్-1 రాకెట్ అనేక ప్రత్యేకతలను సంతరించుకుంది. దీనిని పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో నిర్మించడం వల్ల ఇది చాలా తేలికగా ఉండటమే కాకుండా అత్యంత పటిష్టంగా ఉంటుంది. అంతేకాకుండా, ఇందులో అత్యాధునిక 3డీ ప్రింటెడ్ ఇంజన్లను వినియోగించారు. సుమారు 300 నుండి 480 కిలోల బరువున్న ఉపగ్రహాలను 500 కిలోమీటర్ల లో-ఎర్త్ ఆర్బిట్ (ూజుూ)లోకి ప్రవేశపెట్టగల సామర్థ్యం ఈ రాకెట్‌కు ఉంది. 2025 నవంబర్‌లో ఆవిష్కరించబడిన ఈ రాకెట్, 2026 ప్రథమార్థంలోనే నింగిలోకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది.

**ప్రైవేట్ రంగంలో మైలురాయి**

భారతదేశంలో అంతరిక్ష రంగాన్ని ప్రైవేట్ భాగస్వామ్యానికి తెరిచిన తర్వాత, ఒక ప్రైవేట్ సంస్థ పూర్తిస్థాయి కమర్షియల్ ఆర్బిటల్ రాకెట్‌ను ప్రయోగానికి పంపడం ఇదే మొదటిసారి. శ్రీహరికోట చేరుకోనున్న విక్రమ్-1, అక్కడ తుది దశ పరీక్షల అనంతరం నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ ప్రయోగం విజయవంతమైతే అంతర్జాతీయ వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాల మార్కెట్లో హైదరాబాద్ సంస్థలకు సరికొత్త అవకాశాలు లభిస్తాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, స్కైరూట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేటి నుంచే 'డిజిటల్' జనగణన

**మీ వివరాలు మీరే నమోదు చేసుకోవచ్చు!**

**మే 10 వరకు సెల్ఫ్-ఎన్యుమరేషన్‌కు అవకాశం..**

**వెబ్ పోర్టల్‌ను ప్రకటించిన భారతీ హోళికెరి**

**తెలంగాణలో తొలిసారి కులగణన..**

**ఇంటింటికీ రానున్న ఎన్యుమరేటర్లు**



**(సిరి న్యూస్) హైదరాబాద్, ఏప్రిల్25:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొట్టమొదటి జనగణన (జనగణన-2027) ప్రక్రియకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సెల్ఫ్-ఎన్యుమరేషన్' (స్వయం నమోదు) కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు జనగణన తెలంగాణ డైరెక్టర్ భారతీ హోళికెరి వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న ఈ ప్రక్రియ ఏప్రిల్ 26 నుంచి మే 10వ తేదీ వరకు కొనసాగుతుందని వివరించారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఈసారి జనగణనను పూర్తిస్థాయిలో డిజిటల్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటిసారిగా కులగణనను కూడా ఈ ప్రక్రియలో భాగంగా చేపట్టడం విశేషమని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజలు నేరుగా జనగణనలో పాల్గొనేందుకు ఈసారి సెల్ఫ్-ఎన్యుమరేషన్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా https://se.census.gov.in వెబ్ పోర్టల్ ద్వారా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని, అయితే ఇది కేవలం ప్రజల సౌలభ్యం కోసం కల్పించిన సౌకర్యం మాత్రమేనని, తప్పనిసరి కాదని ఆమె స్పష్టం చేశారు. జనగణన ప్రక్రియను రెండు దశల్లో పూర్తి చేయనున్నట్లు భారతీ హోళికెరి వివరించారు. మొదటి దశలో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటినీ సందర్శించి భవనాలను గుర్తిస్తారని చెప్పారు. ఆస్పత్రులు, బడులు, గుడిసెలు, అద్దె భవనాలు ఇలా భౌగోళికంగా ఉన్న ప్రతి కట్టడాన్ని లెక్కిస్తామని, ఒక భవనంలో ఉన్న ప్రతి కుటుంబాన్ని పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఇళ్ల గణన కోసం ప్రత్యేకంగా బ్లాకులను విభజించి ఎన్యుమరేటర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి రెండో దశ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆ సమయంలో ఎన్యుమరేటర్లు ప్రతి వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తారని డైరెక్టర్ తెలిపారు. 2027 ఫిబ్రవరి నాటికి అంతా సిద్ధం చేస్తామని, తెలంగాణ భౌగోళిక పరిధిలోని ప్రతి ఇంటినీ లెక్కిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కూడా ఎన్యుమరేటర్లకు సహకరించి ఖచ్చితమైన సమాచారం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీని బలోపేతం చేయడమే లక్ష్యం:పొన్నం

**(సిరి న్యూస్) హైదరాబాద్,ఏప్రిల్ 25:** తెలంగాణ ఆర్టీసీని మరింత బలోపేతం చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రెండు రోజుల పాటు జరిగిన సమ్మె సమయంలోనే కార్మికులతో పలుమార్లు చర్చలు జరిపామని, వారి ప్రధాన డిమాండ్లను పరిష్కరించామని పేర్కొన్నారు. శనివారం ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు. అధికార ప్రతినిధులు, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులతో మంత్రి పొన్నం ప్రభాకర్ జూమ్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం కార్మికుల చిరకాల స్వప్నమని, దాన్ని తాము నెరవేర్చామని పేర్కొన్నారు. అలాగే కార్మిక సంఘాల ఎన్నికలు, 11శాతం పీఆర్సీ ప్రకటించడం వంటి అంశాలపై ఆర్టీసీ సిబ్బంది సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ నిర్ణయాలను చారిత్రాత్మకంగా అభివర్ణిస్తూ కార్మికులు సంబరాలు జరుపుకోవాలని నిర్ణయించారని.. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ కేడర్ కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రుల బృందం సుమారు 15 గంటలపాటు కార్మికులతో చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు. ఇంకా మిగిలిన సమస్యలనూ కూడా దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 55 రోజులపాటు సమ్మె చేసినా, వారి డిమాండ్లు నెరవేర్చలేదని విమర్శించారు. ఆ సమయంలో 30 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తమ ప్రభుత్వానికి కార్మికులతో విభేదాలు లేవని, వారిని కుటుంబ సభ్యుల్లా భావిస్తున్నామని చెప్పారు. సమ్మె సమయంలో ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ శవ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. సమ్మె సమయంలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు వ్యవహరించిన తీరు సరికాదని అభిప్రాయపడ్డారు. 2013 బాండ్లు, 2017 పీఆర్సీ, డీఏలు, సీసీఎస్, పీఎఫ్ బకాయిల చెల్లింపులు, కొత్త బస్సుల కొనుగోలు, ఉద్యోగాల భర్తీ, కారుణ్య నియామకాలు వంటి అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే సర్వీసు నుంచి తొలగించిన కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకున్నామని ప్రస్తావించారు. ప్రస్తుతం రోజుకు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగిస్తున్నారని తెలిపారు. పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం ఆర్టీసీ ఒక లైఫ్ లైన్‌లా పనిచేస్తోందని మంత్రి పొన్న ప్రభాకర్ పేర్కొన్నారు.

# మరో 47మంది అజ్ఞాత మావోల లొంగుబాటు

- ఇంకా అజ్ఞతంలోనే గణపతి తదితరులు
- తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, ఏప్రిల్ 25 (సిరి న్యూస్):** తెలంగాణలో మావోయిస్టు ఉద్యమం అంతిమదశకు చేరుకోవడంతో మిగిలిన వారు కూడా లొంగుబాట పట్టారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 47 మంది అజ్ఞాత మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరారు. లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు, అలాగే దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన కీలక నేతలు ఉన్నారు. ముఖ్యంగా హేమ్లా ఇతు (అలియాస్ విజ్జా), పోడియం లచ్చు (అలియాస్ మనోజ్) వంటి నాయకులు ఈ జాబితాలో ఉన్నారని డీజీపీ తెలిపారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టులు భారీగా ఆయుధాలు కూడా అప్పగించారు. మొత్తం 32 ఆయుధాలు, అలాగే 515 తూటాలు పోలీసులకు సమర్పించినట్లు డీజీపీ వెల్లడించారు. వీటిలో ఎకె-47, పలు రకాల రైఫిల్స్‌తో పాటు పిస్టల్స్, రివాల్వర్, మస్కెట్ గన్స్ వంటి వివిధ రకాల ఆయుధాలు ఉన్నాయి.తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస విధానం కారణంగా ఈ మావోయిస్టు కేడర్లు లొంగుబాటుకు ముందుకొచ్చారని చెప్పారు. దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్య స్థితికి చేరిందని కూడా డీజీపీ వ్యాఖ్యానించారు. లొంగిపోయిన వారిలో ఖఒఉం బెటాలియన్‌కు చెందిన 4 మంది, ఆఐ÷ూజిఅకు చెందిన 28 మంది, అలాగే 9వ, 30వ ప్లాటూన్‌లకు చెందిన 15 మంది ఉన్నారని వివరించారు. ఇక తెలంగాణకు చెందిన కొంతమంది కీలక మావోయిస్టు నాయకులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. వారిలో లక్ష్మణరావు (గణపతి), పసునూరి నరహరి (సంతోషం), జాడి రత్నాభాయ్ (సుజాత), వార్త శేఖర్ (మంగు) ఉన్నారని పేర్కొన్నారు. వీరిని కూడా లొంగిపోవాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు ఉద్యమంపై తెలంగాణలో భద్రతా బలగాల చర్యలు మరింత ప్రభావం చూపుతున్నాయని డీజీపీ తెలిపారు. నజీవన స్రవంతిలో చేరి తెలంగాణ ప్రభుత్వ లొంగుబాటు, పునరావాస విధానం ద్వారా లభించే అన్ని ప్రయోజనాలను పొందాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసుల సమర్థవంతమైన పనితీరు వల్ల మొత్తం 818 మంది మావోయిస్టులు లొంగిపోగా, వారి నుంచి 334 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన పునరావాస ప్యాకేజీలు, పోలీసులు సాగిస్తున్న అవగాహన కార్యక్రమాల వల్ల అడవి బాట పట్టిన వారు తిరిగి ఇంటికి చేరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. ఈ భారీ లొంగుబాటుతో రాష్ట్రంలో మావోయిస్టు ప్రభావం మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు.

# కవిత కొత్త పార్టీ టీఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి

బీజేపీ చేతగానితనం వల్ల తెలంగాణ సమాజం ఇబ్బందుల్లో ఉంది. సామాజిక తెలంగాణ కల సాకారం కాలేదు. అప్పట్లో పాలిస్తున్న కుటుంబంలో నేను కూడా భాగమే.. అందుకే కొన్ని విషయాల్లో సిగ్గుపడుతున్నాను, తెలంగాణ ప్రజలను క్షమించమని కోరుతున్నాను" అని ఆమె వ్యాఖ్యానించారు.



### మారిన కేసీఆర్.. ఆగని ప్రాజెక్టులు

గతంలో ఉద్యమం చేసిన కేసీఆర్ వేరని, ఇప్పటి కేసీఆర్ మారిపోయారని కవిత విమర్శించారు. "నాడు చేనేత కార్మికుల కోసం భిక్షాటన చేసిన కేసీఆర్, నేడు మారుమూల ప్రాంతాల్లో కష్టం వచ్చినా రాని మనిషిగా మారిపోయారు.కేసీఆర్ ఇప్పుడు మన కేసీఆర్ కాదని, ఆయన ఒక 'మరబొమ్మ' అయ్యారని వ్యాఖ్యానించారు. గుంటనక్కలు, తోడేళ్ల చేతుల్లో ఆయన ఖైదీ అయ్యారు. కేంద్రంతో గొడవ పెట్టుకోవడం వల్లే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కాలేదు" అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ తన సాంకేతికతను కాపాడుకున్నా, 'ఆత్మ'ను కోల్పోయిందని ఎద్దేవా చేశారు.

### సామాజిక న్యాయమే ఎజెండా

తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ ఇంకా కొనసాగుతోందని, దానిని అంతం చేసి సామాజిక న్యాయం సాధించడమే తమ పార్టీ లక్ష్యమని కవిత ప్రకటించారు. బీజేపీపై విమర్శలు గుప్పిస్తూ.. ఆ పార్టీకి తెలంగాణ ఏర్పడటమే ఇష్టం లేదని, ఏపీలో కలిసిన ఐదు గ్రామాలను తిరిగి తెచ్చే దమ్ము బీజేపీ ఎంపీలకు ఉందా అని సవాల్ విసిరారు. ఆ గ్రామాలు రాకపోతే భద్రాచలం రాముడి గుడి మునిగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

### అమ్మలాంటి పాలన

రాష్ట్రంలోని 3.5 కోట్ల మంది ప్రజలకు అమ్మగా మారి, అమ్మతనంతో కూడిన పాలన అందించాలని తాను ఆశిస్తున్నట్లు కవిత తెలిపారు. తెలంగాణ జాగృతి కార్యకర్తలు ఉద్యమ సమయంలో ఎలాగైతే కాగడా పట్టి వెలుగునిచ్చారో, ఇప్పుడు కూడా ఈ కొత్త పార్టీ కోసం అదే స్ఫూర్తితో పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాధికారంతోనే ప్రజలకు మేలు జరుగుతుందని, అందుకే 'తెలంగాణ రాష్ట్ర సేన' ప్రజల పక్షాన పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు.

### రాష్ట్రంలో 'కర్కోటకుడి' పాలన

రాష్ట్రంలో ప్రస్తుతం ఒక కర్కోటకుడి పాలన నడుస్తోందని, సామాన్య ప్రజల కష్టాలు పట్టని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తామే ప్రధాన ప్రతిపక్షంగా పోరాడుతామని కవిత ప్రకటించారు. ఇది ప్రారంభం మాత్రమేనని, 'ఇన్‌ఫ్రంట్ దేరీజ్ క్రొకడైల్ ఫెస్టివల్' అంటూ కాంగ్రెస్ సర్కార్‌కు హెచ్చరికలు జారీ చేశారు. గురుకుల పాఠశాలల్లో వరుసగా విద్యార్థులు మరణిస్తున్నా సీఎం స్పందించకపోవడం దారుణమని, అందుకే ఆయనను కర్కోటకుడు అనాల్సి వస్తోందని మండిపడ్డారు. ప్రస్తుతం తమ పార్టీయే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షమని, కేవలం రెండేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చేది మనమేనని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

### ఐదు హామీలతో పాంచజన్యం

ఈ సభ వేదికగా కవిత 'పాంచజన్యం' పేరుతో ఐదు కీలక హామీలను ప్రజల ముందుకు తెచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూనే, ప్రైవేట్ స్కూళ్లలోనూ ఉచిత విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. ఏ ఆస్పత్రిలోనైనా ఏ రోగానికైనా ఉచిత వైద్యం అందిస్తామని, 'రైతే రాజు' నినాదాన్ని నిజం చేసేలా వ్యవసాయ రంగాన్ని తీర్చిదిద్దుతామని ప్రకటించారు. యువతకు ఉపాధి కోసం ప్రభుత్వం ద్వారానే రూ. 2 లక్షల నుండి రూ. 20 కోట్ల వరకు రుణాలు అందజేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే సింగిల్ నోటిఫికేషన్‌తో 4 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఉద్యమకారుల కోసం లక్ష 'సూపర్ న్యూమరీ' ఉద్యోగాలను కేటాయిస్తామని వెల్లడిస్తూ సామాజిక న్యాయమే తమ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.

## కచ్చితంగా సీఎంని అవుతా



తెలంగాణలో కొత్త రాజకీయ విప్లవం మొదలైందని, తాను కచ్చితంగా సీఎం అయ్యి తీరుతానని కవిత ధీమా వ్యక్తం చేశారు. తన నూతన పార్టీ ఆవిర్భావం సందర్భంగా మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ఆమె భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె, రాష్ట్ర భవిష్యత్తు కోసం తాను సాగిస్తున్న ఈ పోరాటాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. తన లక్ష్యం స్పష్టమని, రాబోయే రోజుల్లో ప్రజల మద్దతుతో అత్యున్నత పీఠాన్ని అధిరోహిస్తానని ఆమె స్పష్టం చేశారు.మునీరాబాద్ సభకు వెళ్లేముందు కవిత తన నివాసంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. సర్వమత ప్రార్థనల అనంతరం తన భర్త, ఇతర కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకున్నారు. ఆ తర్వాత నేరుగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌కు చేరుకున్న కవిత, అక్కడ తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, వారి ఆశయాల సాధన కోసమే కొత్త పార్టీని స్థాపిస్తున్నట్లు ఆమె ఈ సందర్భంగా ప్రకటించారు.

### మునీరాబాద్‌కు జన ప్రభంజనం

గన్‌పార్క్ వద్ద నివాళులర్పించిన అనంతరం వేలాది మంది కార్యకర్తలతో కలిసి ఆమె మునీరాబాద్‌కు ర్యాలీగా బయలుదేరారు. ఈ ర్యాలీ పొడవునా కార్యకర్తలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలిగా తనకున్న బలమైన కేడర్ అంతా ఈ ర్యాలీలో పాల్గొని సందడి చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో ఈ పరిణామం కొత్త చర్చకు దారితీస్తుందని, ప్రజల పక్షాన నిలబడే ఏకైక శక్తిగా తమ పార్టీ ఎదగబోతోందని కవిత ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

# అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం

### ఎన్నికల హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

### 27 న రెవెన్యూ,హౌసింగ్ అంశాలపై మంత్రి సమీక్షలు



**హైదరాబాద్, ఏప్రిల్ 25:** బీఆర్ఎస్ పాలనలో అసంపూర్తిగా వదిలేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తూ ముందుకు వెళుతున్నామని రెవెన్యూ మంత్రి పొంగులేటి తెలిపారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామిలను కూడా ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ఆరోపణలను లెక్కచేయకుండా, పేదవాడే ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వివరించారు. భూములకు సంబంధించిన సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని పొంగులేటి తెలిపారు. వచ్చే 50 రోజుల్లో సాదాబైనామా అంశాల్లో న్యాయమైన సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తామని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, హసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం నుండి క్షేత్రస్థాయి సమీక్షలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు హిమాయత్‌నగర్ లోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మధ్యాహ్నం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లతో సమిక్షా సమావేశం నిర్వహిస్తారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సంబంధించి ఇటువంటి సమావేశాలను దశలవారీగా నిర్వహించనున్నారు. రాష్ట్రంలో తొలి విడతగా మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు. సుమారు లక్షకు పైగా ఇళ్ళు గృహ ప్రవేశాలకు సిద్దమైన నేపధ్యంలో మంత్రి గారు నిర్వహించే ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పూర్తి, కేటాయింపు, మౌలిక వసతుల కల్పన వంటి విషయాలను కూడా చర్చించనున్నారు. అంతేగాక త్వరలో రెండవ విడత ఇళ్ల మంజూరుకు సంబంధించి కూడా ఈ సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. అదేవిధంగా భూ వివాదాలు, పట్టాదారు పాస్ పుస్తకాల జారీ,తాజాగా అమలు చేస్తున్న భూధార్ , సర్వేమ్యాప్‌ల వంటి కీలక రెవెన్యూ అంశాలపై జిల్లా అధికారులతో మంత్రి చర్చించనున్నారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారు. అలాగే జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీవోలు, జిల్లా హౌసింగ్ అధికారులు పాల్గొననున్నారు.

# మహిళ విద్యా,ఉపాధిపై ప్రభుత్వం దృష్టి

### లాభదాయక వ్యాపారాలపై దృష్టి సారించాలి

### టీనేజ్ బాలికల కోసం స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్

### మంత్రి సీతక్క వెల్లడి



**(సిరి న్యూస్)హైదరాబాద్, ఏప్రిల్ 25:** మహిళల విద్య, ఉపాధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళల ఆర్థికాభివృద్ధికి క్రమశిక్షణ, లాభదాయక వ్యాపారాలపై దృష్టి పెట్టాలని సూచించారు. టీనేజ్ బాలికల కోసం స్నేహా సమ్మర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. లైఫ్ స్కిల్స్, భద్రత, సైకిల్ ట్రైనింగ్ కార్యక్రమాలు చేపడుతామని.. ఈ కార్యక్రమాలను బాలికలంతా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క దిశానిర్దేశర చేశారు. త్వరలో మహిళా సంఘ సభ్యుల ఎడ్యుకేషన్ ప్రొఫైల్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. మహిళల విద్యార్హతలను గుర్తించి ఉన్నత విద్య అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. శనివారం బీఆర్‌కే భవన్‌లో సెర్ఫ్ డైరెక్టర్లు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షులతో మంత్రి సీతక్క సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళా సంఘ భవనాల నిర్మాణం, 'అమ్మకు అక్షరమాల', సెర్ప్ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడారు. ప్రతి మహిళా అక్షరాస్యురాలిగా ఉండటమే తమ ప్రభుత్వ లక్షమని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. 5,239 గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణ పనులు ఊపందుకున్నాయని వెల్లడించారు. ఇప్పటికే కొన్ని వీఓ భవనాలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఈ పనులను వేగవంతం చేస్తున్న అధికారులకు అభినందనలు తెలిపారు. వచ్చే ఏడాది మరో 5,000 వీఓ భవనాలను నిర్మిస్తామని చెప్పుకొచ్చారు. 'అమ్మకు అక్షరమాల' ద్వారా ఇప్పటివరకు 6.5 లక్షల మహిళలకు అక్షరజ్ఞానం కల్పించామని వెల్లడించారు. త్వరలో మరో 6.5 లక్షల మహిళలకు గ్రామాల్లోనే విద్యాబోధన కల్పిస్తామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మహిళా సంఘాలు.. బాల్య వివాహాల వంటి సామాజిక రుగ్మతల నిరోధంలో ముందుండాలని పిలుపునిచ్చారు.




# ఎంతయినా ఒరిజినల్ ఒరిజినలే

### కవిత పార్టీపై బీఆర్ఎస్ సెటైర్లు

### అసలు ఒరిజినలే లేదుగా అంటూ టీఆర్ఎస్ ప్రతిదాడి

హైదరాబాద్, ఏప్రిల్ 25 (సిరి న్యూస్): కవిత పార్టీపై బీఆర్ఎస్ వ్యంగ్యంగా స్పందించింది. కవిత తన కొత్త పార్టీ పేరును టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన)గా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై స్పందించిన బీఆర్ఎస్.. ఎంతైనా ఒరిజినల్ ఒరిజినలే అని సెటైర్ వేసింది. కవిత పార్టీ పేరును కాపీ కొట్టిందని అర్థం వచ్చేలా ట్వీట్ చేసింది. సెటైర్‌గా ఒరిజినల్, డూప్లికేట్ కోల్గేట్, బిస్లేరీ ఫొటోలు షేర్ చేసింది బీఆర్ఎస్. ఒరిజినల్ ఎప్పటికీ ఒరిజినలే అంటూ బీఆర్ఎస్ పోస్ట్ చేసింది. అయితే టిఆర్ఎస్ అన్న ఒరిజినల్ పార్టీ కూడా ఇప్పుడు తమ వద్ద లేదన్న ఇంగితం కూడా బిఆర్ఎస్ గుర్తించలేదు. ఒరిజినల్ ఉంటే డూప్లికేట్ గుర్తించవచ్చారు. ఒరిజినల్ లేకుండానే బిఆర్ఎస్ విమర్శలు చేస్తోందని కొత్తగా ఏర్పాటైన టిఆర్ఎస్ నేతలు అప్పుడే విమర్శలకు పదను పెట్టారు.

# కవిత పార్టీతో ఒరిగేదేమీ లేదు

### తెలంగాణలో వచ్చిదే బిజపియే

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు




**(సిరి న్యూస్)హైదరాబాద్, ఏప్రిల్ 25:** కల్వకుంట్ల కవిత తెలంగాణ రాష్ట్ర సేన పార్టీ పేరు ప్రకటించారు. ఇక కవిత కొత్త పార్టీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పందించారు. కేఏ పాల్ కూడా పార్టీ పెట్టారని గుర్తు చేశారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపు నిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు. 'గతంలో టీఆర్ఎస్.. ఇప్పుడు బీఆర్ఎస్ పుట్టబోయే బిడ్డ పేరు టీఆర్ఎస్ అంటా.. ఎన్ని పార్టీలు వచ్చినా.. ఎన్ని పార్టీలు ఉన్నా బీజేపీకి ఇబ్బంది లేదు.. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని రామచందర్‌రావు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. టీఆర్ఎస్ అధినేత్రి కవిత పార్టీ ఆవిర్భావ సభలో బీజేపీపై ఫైర్ అయ్యారు. తెలంగాణ నుంచి 7 మండలాలు లాక్కుంటే బీజేపీ ఎంపీలు మాట్లాడటం లేదన్నారు. 'విభజన హామీలు నెరవేర్చకపోతే బీజేపీ ఎంపీలు మాట్లాడరు. సామాజిక న్యాయానికి బద్ధ వ్యతిరేకి బీజేపీ. తెలంగాణ బీజేపీ ఎంపీలకు సవాల్ విసురుతున్నా.. తెలంగాణ తల్లి బిడ్డలైతే ఏపీలో కలిసిన కనీసం 5 గ్రామాలను వెనక్కి వచ్చేలా చూడాలి. భద్రాచలం వద్ద ఉన్న 5 గ్రామాలు పోతే రాముడి గుడి మునుగుతుంది. గ్రామాలను వెనక్కి తీసుకురావడానికి జాగృతి తరఫున కేంద్రానికి లేఖ రాశాం. మూడు పార్టీలపై అలుపెరగని పోరాటానికి కార్యకర్తలంతా సిద్ధం కావాలని కవిత పేర్కొన్నారు. బీజేపీ ప్రజలకోసం పనిచేసే పార్టీ అని రామచంద్రరావు అన్నారు. పార్టీకి కేబర్, లీడర్ ఉన్న పార్టీ అన్నారు. కవిత పార్టీతో తెలంగాణకు ఒరిగేదేమీ లేదన్నారు.

# తండ్రి పిట్టల దొర.. బిడ్డ పిట్టల దొరసాని

### కవితకు రాజకీయ సమాధి కట్టిందే బిజెపి

### మీడియా సమావేశంలో నిజామాబాద్ ఎంపి అర్వింద్



**(సిరి న్యూస్)హైదరాబాద్, ఏప్రిల్ 25:** సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే.. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కాదని బీజేపీని గెలిపించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పిట్టల దొరను చూశారని.. ఇప్పుడు పిట్టల దొరసానిని చూస్తారని వ్యంగ్యంగా విమర్శించారు. కవితకు బీజేపీ రాజకీయ సమాధి కట్టిందని గుర్తు చేశారు. శనివారం కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పేరు ప్రకటించారు. ఈ సందర్భంగా కవిత పలు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పందించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం బీజేపీ మద్దతు లేకుండా వచ్చిందా? అంటూ కవితను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇండియా-పాకిస్తాన్ విభజన పక్రియలో ఎంతో మంది చనిపోయారని వివరించారు. వీళ్లు ప్రకటించి వెనక్కి తీసుకున్నారు కాబట్టే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది చనిపోయారని చెప్పారు. ఇదే విషయంపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య లోక్‌సభలో ప్రస్తావించారని పేర్కొన్నారు. తేజస్వి వ్యాఖ్యలను బీఆర్ఎస్ కళ్ళద్దాలతో చూడకండంటూ రాజకీయ పార్టీల నేతలకు ఆయన స్పష్టం చేశారు. అజారుద్దీన్ అదృష్టం బాగుందని.. అందువల్ల ఆయన మంత్రి అయ్యారన్నారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయం వల్ల అజారుద్దీన్ ఎమ్మెల్సీ అయ్యారని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. పిట్టల దొర క్యారెక్టర్ కేసీఆర్ అయితే.. పిట్టల దొరసాని క్యారెక్టర్ కవితది అన్నారు. సామాజిక తెలంగాణ రాలేదు కాబట్టే ప్రజలు వాళ్లను ఓడించి బీజేపీని గెలిపించారన్నారు. ఆమెకు రాజకీయ సమాధి కట్టింది బీజేపీ అని చెప్పారు. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తుంది.. అనేది ప్రజలు ఆలోచించాలని పిలుపునిచ్చారు. 12 ఏళ్ల పాలనలో నరేంద్ర మోడీ అవినీతి రహిత పాలన అందించారని చెప్పారు.

# టీజీఎస్పీడీసీల్ సీఎండీ జితేష్ వి పాటిల్ పై ప్రశంసలు జల్లు



**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్ ఏప్రిల్ 25:.**

ఉన్నత అధికారినన్న దర్పం లేదు .నేను చెప్పిందే వినాలన్న నియంతృత్వ ధోరణి అస్సులు లేదు. అందుకు బిన్నంగా కిందిస్థాయి అధికారులు సిబ్బంది మనసు చురగునే పనిలో నిమగ్నమయ్యారు ఆ అధికారి. పని చేయని వాళ్లపై వేటు వేయడం మాత్రమే కాదు పని చేసే వారిని సైతం సన్మానించాలన్న కొత్త పంథాతో అధికారిగా వచ్చిన 2 నెలల్లోనే అందరివాడయ్యాడు. కార్మికుల పక్షపాతిగా పేరుతెచుకున్నాడు. ఇప్పుడు అయన అధికారిగా కాదు కష్టపడి పనిచేసేవాళ్ళ నాయకుడయ్యాడు. అతనే జితేష్ వి పాటిల్ తెలంగాణ విద్యుత్ శాఖలో టీజీఎస్పీడీసీల్ కంపనీ సీఎండీ. ఒక ఐఏఎస్ అధికారిగా కంపనీ బాస్ గా ప్రజలకు తెలిసిన అతను వచ్చిన కొద్దిరోజుల్లోనే కింది స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ కష్టపడి సంస్థ కోసం పనిచేసే వాళ్ళను సన్మానిస్తున్నారు. వాస్తవానికి సుబ్స్టేషన్లలో నిర్వహణ కోసం సరైన సామాగ్రి ఉండదు. గడ్డి మొలిస్తే ఆపరేటర్ తొలగించాల్సిందే. వాచ్మెన్ లేని సుబ్స్టేషన్స్ లెక్కలేనన్ని అలాంటి చోట ఆపరేటర్ అన్ని పనులు చేసుకోవాల్సిందే .ఇక విద్యుత్ సరఫరా ప్రారంభం అయ్యే 33/ 11 కేవీ సుబ్స్టేషన్లలో సమస్యలు కోకొల్లలు ఆలాంటి వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా కొత్తగా వచ్చిన సీఎండీ చర్యలు చేపట్టారు.ఇందుకోసం సమయం దొరికినప్పుడల్లా క్షేత్ర స్థాయిలో వెళ్లి పరిశీలిస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది పనిచేయకపోవడానికి గల కారణాలు తెలుసుకుంటూ వాటిని వెంటనే పరిష్కరిస్తున్నారు. ఒక వైపు అధికారులు సిబ్బంది మధ్య సమన్వయము ఉన్నచోట కలెక్షన్ ఎలా ఉంది? బ్రేక్ డౌన్స్ ఐతే ఎలా పనిచేస్తున్నారన్న విషయాన్ని తెలుసుకుంటున్నారు.

## కొత్త బాస్ పై కార్మికుల ఫిదా

టీజీస్పీడీసీల్ సీఎండీ జితేష్ వి పాటిల్ క్షేత్ర స్థాయి పర్యటన కింది స్థాయి సిబ్బందిలో కొత్త ఉత్సహాన్ని నింపింది. ఉన్నతాధికారులు ఎప్పుడు తాము ఎలా ఉన్నామో తెలుసుకునేవారు కాదని కొత్త బాస్ ముక్యంగా తమ సమస్యలు తెలుసుకోవడం ఆనందంగా ఉందని ఆపరేటర్లు పేర్కొంటున్నారు. మాములుగా ఒక సుబ్స్టేషన్ ఆపరేటర్ ఎం చేస్తున్నాడు అతనికి ఎం కావాలి అని ఎవరు అడగరు. అలాగే నిబద్దతో పనిచేసే వారిని గుర్తించి సన్మానించరు. కనీసం పలకరించారు అలాంటిది కంపనీ ఉన్నతాధికారి ఇలా వచ్చి మెచ్చుకోవడం పట్ల కింది స్థాయి సిబ్బంది ఆత్మస్తైర్యాన్ని పెంచింది .టీజీఎస్పీడీసీల్ సీఎండీ కొత్త పంథా కార్మికులు మరింత కష్టపడి పనిచేయడానికి మార్గాన్ని ఏర్పరిచింది.ఇక అధికారులు కూడా కష్టపడి తమ ప్రాంతంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా రెవిన్యూ వచ్చేలా పోటీ పడుతున్నారు. ఇందుకు కారణం సైతం సీఎండీ దృష్టిలో పడాలన్నా ఆకాంక్ష. ఇలా ఒక ఐఏఎస్ అధికారి తాను సీఎండీ గా ఉన్న సంస్థ అభివృద్ధి కోసం ఎంచుకున్న మార్గం క్షేత్ర స్థాయిలో మంచి ఫలితాలు ఇస్తుండటం.. అయన పట్ల ఇటు కార్మికుల్లో అటు నెటిజెన్లలో సైతం ట్రేండింగ్ గా మారింది.

# బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుండు రాజు

**(సిరి న్యూస్)మంచిర్యాల:** ఆర్ కృష్ణయ్య బీసీ దళపతి మాజీ రాజ్యసభ సభ్యుడు జాతీయ కార్యదర్శి పగడాల సుధాకర్ కన్వీనర్ ఉజ్జ కృష్ణ జనార్దన్ పలువురి ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందించారు ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ ఉపాధ్యక్షులు వెంకటేష్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి విజయ్ పలువురు ప్రశంసించారు మునుముందు రాబోయే రోజుల్లో బహుజన బీసీ వాదుల్లో బీసీల ఐక్యతతో పాటు తెలంగాణ రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారం రాబోతుంది అన్నారు.

# ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

## ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట ఇమామ్ సాబ్):** విద్యార్థులు పట్టుదలతో శ్రమిస్తే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు. నర్వ మండలానికి చెందిన ఎస్బీ కానిస్టేబుల్ మురళీకృష్ణ కుమారులు విద్యా, క్రీడా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వారిని ప్రత్యేకంగా అభినందించారు. కానిస్టేబుల్ పెద్ద కుమారుడు జి. గౌతమ్ ఇంటర్ ఎంపీసీలో 1000కి 983 మార్కులు సాధించడంతో పాటు, జేఈఈ మెయిన్స్‌లో 96.71 పర్సంటైల్ సాధించి సత్తా చాటాడు. చిన్న కుమారుడు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 428 మార్కులు సాధించడమే కాకుండా, ఫుట్‌బాల్‌లో జాతీయ స్థాయి పోటీలకు (అండర్-14, 17) ఎంపికై రాణించాడు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులను శాలువాతో సన్మానించి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు కృషి చేసిన కానిస్టేబుల్ మురళీకృష్ణను అభినందించారు. క్రమశిక్షణ, పట్టుదలే విజయానికి మూలస్తంభాలని, సాధారణ కుటుంబం నుండి వచ్చిన విద్యార్థులు దేశ స్థాయిలో గుర్తింపు పొందడం జిల్లాకు గర్వకారణమని ఎస్పీ పేర్కొన్నారు.

# రావణ వాహనంపై శివపార్వతులు

**చౌడేపల్లి** పట్టణంలోని అభీష్టత మృత్యుంజయ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం శివపార్వతులు రావణుడు పై ఊరేగారు ఆలయ ప్రధాన అర్చకుడు రాజశేఖర్ దీక్షితులు శివకుమార్ స్వామి మహేష్ల ఆధ్వర్యంలో స్వామివారికి విషెస్ అభిషేకం అలంకరణ గమనించారు రాత్రి వినాయక స్వామి సమేత శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను రావన వాహనంపై ఉంచి భక్తులకు దర్శనం ఇప్పించారు .వాహన సేవకు సజ్జన కులస్తులు ఉభయ దారులుగా వ్యవహరించారు .బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయము వాహనాలను వివిధ రకాల పుష్పాలు విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు

# నన్ను వివాదంలోకి లాగడం సరికాదు

- మాజీ ఆర్మీ చీఫ్ నరవణె
- 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' వివాదంపై తొలిసారి స్పందన..
- అది ముగిసిన అధ్యాయమని వెల్లడి
- ప్రచురితం కాని పుస్తకాన్ని కోట్ చేయడంపై ఆవేదన



**న్యూఢిల్లీ:** భారత సైన్యానికి నాయకత్వం వహించిన మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె, తన అముద్రిత ఆత్మకథ 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ'పై నెలకొన్న రాజకీయ వివాదంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రచురణకు నోచుకోని పుస్తకంలోని అంశాలను వెలుగులోకి తెచ్చి, తనను అనవసరంగా వివాదాల్లోకి లాగారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ఆయన రాసిన మరో పుస్తకం 'ది క్యూరియస్ అండ్ ది క్లాసిఫైడ్: అన్ ఎర్తింగ్ మిలిటరీ మిత్స్ అండ్ మిస్టరీస్' విడుదలైన సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ అంశాలపై స్పందించారు. చైనా సరిహద్దుల్లో జరిగిన ఘర్షణలు, అగ్నిపథ్ పథకం వంటి కీలక అంశాలపై నరవణె తన ఆత్మకథలో రాశారని ప్రచారం జరిగింది. అయితే, రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి ఈ పుస్తక ప్రచురణకు ఇంకా అనుమతి లభించలేదు. ఈ క్రమంలో, ప్రచురితం కాని పుస్తకంలోని కొన్ని భాగాలను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రస్తావించడం రాజకీయ దుమారానికి దారితీసింది. దీనిపై నరవణె స్పందిస్తూ.. "అసలు బయటకే రాని పుస్తకాన్ని కోట్ చేసి చర్చలు జరపడం ఏమాత్రం సమంజసం కాదు. నన్ను ఈ వివాదంలోకి లాగడం సరైన పద్ధతి కాదు" అని పరోక్షంగా రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

## అది ముగిసిన అధ్యాయం

గత కొద్ది రోజులుగా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఈ వివాదం ఇప్పుడు ముగిసిందని నరవణె స్పష్టం చేశారు. దీనిపై మరింత చర్చ అవసరం లేదని, ప్రస్తుతం తాను కొత్త పుస్తకాలపై దృష్టి సారించానని తెలిపారు. రక్షణ శాఖ నుంచి అనుమతి వచ్చిన తర్వాతే 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పాఠకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. రాజకీయాలకు అతీతంగా దేశ రక్షణ వ్యవస్థలో కీలక పాత్ర పోషించిన మాజీ ఆర్మీ చీఫ్, తన పుస్తకం చుట్టూ జరుగుతున్న రాజకీయ విమర్శలను తోసిపుచ్చడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# హర్మూజ్‌లో అమెరికా సైనిక ఆంక్షలు..

- అణ్వాయుధ కార్యక్రమాలు వీడే వరకు సైనిక ఒత్తిడి తప్పదు
- రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్
- ప్రపంచ చమురు రవాణాపై అగ్రరాజ్యం పట్టు.. మిగిలిన దేశాల్లో కలవరం



**వాషింగ్టన్:** మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు యుద్ధ మేఘాలను మరింత దట్టం చేస్తున్నాయి. ప్రపంచ చమురు వాణిజ్యానికి వెన్నెముక వంటి హర్మూజ్ జలసంధిపై అమెరికా తన పట్టును మరింత బిగించింది. ఇరాన్ నౌకల రాకపోకలను అడ్డుకుంటూ అగ్రరాజ్యం విధిస్తున్న ఈ దిగ్బంధనాన్ని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ఒక 'ఉక్కు కవచం'తో పోల్చారు. ఈ వ్యూహాత్మక మార్గంలో అమెరికా పట్టు మరికొంత కాలం కొనసాగుతుందని ఆయన అధికారికంగా ప్రకటించారు. ఇరాన్ తన అణ్వాయుధ తయారీ కార్యక్రమాలను పూర్తిగా నిలిపివేసే వరకు ఈ ఆర్థిక మరియు సైనిక ఒత్తిడి కొనసాగుతుందని హెగ్సెత్ హెచ్చరించారు. "ఇది కేవలం తాత్కాలిక చర్య కాదు, అవసరమైతే శాశ్వత దిగ్బంధనంగా మారవచ్చు. అంతర్జాతీయ స్థిరత్వానికి మరియు ప్రపంచ శాంతికి ఇరాన్ నుంచి పొంచి ఉన్న ముప్పును తొలగించడమే మా ప్రథమ లక్ష్యం" అని ఆయన స్పష్టం చేశారు. ఈ మిషన్ ప్రమాదకరమైనదైనప్పటికీ, ప్రపంచ ప్రయోజనాల దృష్ట్యా తాము ఈ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే ముడిచమురులో ఐదింట ఒక వంతు హర్మూజ్ జలసంధి గుండానే వెళుతుంది. ఇప్పుడు అమెరికా దీనిని తన నియంత్రణలోకి తీసుకోవడంతో అంతర్జాతీయ ఇంధన ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అమెరికా వైఖరిని కొన్ని దేశాలు తప్పుబడుతున్నప్పటికీ, అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం మాత్రం తన 'ఉక్కు కవచం' వ్యూహంతో ముందుకు వెళుతోంది. ఈ దిగ్బంధనం ఇరాన్‌ను లొంగదీసుకుంటుందా లేక మరో భారీ యుద్ధానికి దారితీస్తుందా అన్నది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

# మే 5 నుంచి బెంగాల్‌లో మహిళలకు స్వేచ్ఛ


- రాత్రి ఒంటిగంట తర్వాత కూడా స్వేచ్ఛగా రావచ్చు
- ఎన్నికల ప్రచారంలో కేంద్రహోంమంత్రి అమిత్ షా



కోల్‌కతా, ఏప్రిల్ 25: ప్రస్తుతం బెంగాలీ మహిళలు భయంతో జీవిస్తున్నారని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. మహిళలు సాయంత్రం ఏడు తర్వాత బయటికి రావొద్దంటూ మమతా బెనర్జీ గతంలో చేసిన వ్యాఖ్యలను అమిత్ షా విమర్శించారు. మే ఐదో తేదీ తర్వాతి నుంచి పశ్చిమ బెంగాల్ మహిళలు రాత్రి ఒంటిగంట తర్వాత కూడా భయం లేకుండా రోడ్లపై తిరగొచ్చని అమిత్ షా పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని పూర్బ బర్ధమాన్ జిల్లాలోని జమాల్‌పూర్ గ్రామంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా పాల్గొన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత విషయంలో విఫలమయ్యారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై విమర్శలు గుప్పించారు. 'ఒక మహిళా ముఖ్యమంత్రి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైన పాలనకు సంకేతమా?' అని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ మహిళలు ధైర్యంగా ఉన్నారని, మే 5 తర్వాత బెంగాలీ మహిళల పరిస్థితి కూడా మెరుగుపడుతుందని అన్నారు. తల్లులు, సోదరీమణుల వైపు దురుద్దేశంతో చూసేందుకు ఏ దుండగుడు సాహసించినా, వారిని జైలులో పెడతామని భారతీయ జనతా పార్టీ హామీ ఇస్తుందన్నారు. గత పదిహేను సంవత్సరాల మమతా బెనర్జీ పాలనలో, అత్యధికంగా నష్టపోయిన వారు మన తల్లులు, సోదరీమణులే. బెంగాల్‌లో మహిళలపై ఎన్నో హింసాత్మక ఘటనల జరిగాయి. మహిళలు రాత్రి 7 గంటల తర్వాత ఇళ్ల నుంచి బయటకు రాకూడదని దీదీ అంటున్నారు. నేను మీకు చెప్పేదేమిటంటే.. 5వ తేదీ తర్వాత, యువతులు రాత్రి 1 గంట తర్వాత కూడా బయటకు రాగలరు. ఏ దుండగుడూ ఆమె వైపు చూడటానికి కూడా సాహసించడని అమిత్ షా హామీనిచ్చారు.

# దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

- పలు రాష్ట్రాలకు 'వడగాల్పుల' హెచ్చరిక
- రాజస్థాన్‌లో 44.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత..
- ఏప్రిల్ నుంచి జూన్ వరకు తీవ్ర ప్రభావం
- మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని ఐఎండీ సూచన..
- రాత్రిపూట వీస్తున్న వేడి గాలులు




**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ఎండల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఉత్తర, దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతుండటంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హీట్‌వేవ్ హెచ్చరికలు జారీ చేసింది. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో అత్యధికంగా 44.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో వేడితో పాటు తేమ శాతం పెరగడంతో ఉక్కపోత తీవ్రంగా ఉంది. ఉత్తర భారతంలో పగటిపూటే కాకుండా రాత్రి వేళల్లో కూడా వేడి గాలులు వీస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు తూర్పు, మధ్య మరియు వాయువ్య భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం వాయువ్య, మధ్య భారతంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 44 డిగ్రీల మధ్య రికార్డవుతున్నాయి. అనేక చోట్ల సాధారణం కంటే 5 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరగడం పట్ల నిపుణులు అప్రమత్తం చేస్తున్నారు. జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరగనుంది. తీవ్రమవుతున్న ఎండల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించింది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు మరియు అనారోగ్య సమస్యలు ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. సరిపడా నీళ్లు తాగాలని, తేలికపాటి నూలు వస్త్రాలు ధరించాలని, శ్రవంతో కూడిన పనులను ఎండలో చేయవద్దని సూచించింది. ఐఎండీ అంచనాల ప్రకారం, వాయువ్య భారతదేశంలో ఏప్రిల్ 27 వరకు ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదు. ఆ తర్వాత క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది. ఇతర ప్రాంతాల్లో మాత్రం మొదట ఉష్ణోగ్రతలు పెరిగి, ఆపై స్వల్పంగా తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. తీర ప్రాంత రాష్ట్రాల్లో ఉక్కపోత కారణంగా ప్రజలు మరింత అసౌకర్యానికి గురయ్యే అవకాశం ఉందని అధికారులు వివరించారు.



# అమ్మవారికి స్వర్ణ హారం భక్తుల భారీ విరాళం

## మొక్కు తీరింది భక్తురాలు మురిసింది



ఆమీన్ పూర్ ఏప్రిల్ 25 సిరి న్యూస్

అమీన్ పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలోని బీరంగూడ శ్రీ భ్రమరాంబిక సాహిత మల్లికార్జున స్వామి ఆలయంలో శనివారం భ్రమరాంబిక మాతకు భక్తులు ఐదు తులాల బంగారు ఆరాని సమర్పించారు.రామచంద్రపురం మల్లికార్జున నగర్ కాలనీకి చెందిన ముక్కిరాల పద్మారావు శారదాదేవి దంపతులు, ముక్కిరాల మద న్మోహన్రావు గిరిజదేవి దంపతులు తమ కోరికలు నెరవేరడంతో మొక్కు తీర్చుకో వడంలో భాగంగా అమ్మవారికి ఈ పసిడి ఆభరణాన్ని బహుకరించారు. ఆలయ చైర్మన్ బైంసా సుధాకర్ యాదవ్, ఈవో శశిధర్ గుప్త ఆధ్వర్యంలో అందజేశారు.ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ ఈ జగన్మాత్మక, అనుగ్రహం వల్లే నా జీవితంలో అన్నీ శుభాలే జరిగాయి, అమ్మవారికి ఏదైనా సమర్పించుకోవాలన్న , నా చిరకాల వాంఛ మొక్కు నేటికీ నెరవేరింది. నేను ఇచ్చింది చాలా స్వల్పం కానీ ఆ తల్లి నాకు ప్రసాదించిన ఆశీస్సులు వెలకట్టలేనివి, అని తెలిపారు. ఈ ఐదు తులాల బంగారు భారాన్ని అమ్మవారికి అలంకరణలో భాగంగా స్వీకరించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు.లోకమంతా సుభిక్షంగా ఉండాలని అందరిపై ఆ తల్లి కరుణ కటక్షాలు ఉండాలని మనస్పూర్తిగా ప్రార్థిస్తున్నానని తెలిపారు.

# రసాయన శాస్త్రంలో ఎం. కిషోర్ కు పీహెచ్.డీ.

రామచంద్రపురం,(పటాన్ చేరు), ఏప్రిల్ 25,(సిరి న్యూస్):



గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి ఎం. కిషోర్ పీహెచ్.డీ. పట్టాకు అర్హత సాధించారు.పెరోవ్స్కైట్ సౌర సెల్స్ కోసం నూతన రంధ్ర వాహకె పదార్థాలపై చేసిన పరిశోధనకు ఈ పట్టా లభించింది. ఈ అధ్యయనంలో అభివృద్ధి చేసిన పదార్థాలతో 21.14% వరకు విద్యుత్ మార్పిడి సామర్థ్యం సాధ్యమైందని తెలిపారు.ఈ పరిశోధనకు ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల మార్గదర్శకత్వం వహించగా, గీతం అధికారులు అభినందనలు తెలిపారు.

# ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



వెల్దుర్తి, ఏప్రిల్ 25, (సిరి న్యూస్):

వెల్దుర్తి ఉమ్మడి మండలం హక్కింపేట్, రామంతాపూర్,మహమ్మద్ నగర్ తండా, గ్రామలలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ( ఐకెపి సెంటర్ )ద్వారా ఏపీఎం సుభాష్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ లు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యాన్ని అమ్మితేనే సరైన లాభం ఉంటుందని అలాగే ఖాతాలో డబ్బులు కూడా తొందర్లోనే జమవుతాయని వారు తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ సభ్యులు గ్రామా ప్రజా ప్రతినిధులు ఐకెపి సెంటర్ నిర్వాహకులు , సీసీ లు, తదితరులు పాల్గొన్నారు..

# అంగన్ వాడీ కేంద్రంలో యాన్యువల్ డే సంబరాలు




కొండాపూర్ ఏప్రిల్ 25 ( సిరి న్యూస్)

మండల పరిధిలోని గొల్లపల్లి అంగన్ వాడి కేంద్రంలో వార్షికోత్సవ కార్యక్రమం శనివారం యాన్యువల్ డే సంబరాలు నిర్వాహకులు ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న సేవలపై తల్లిదండ్రులకు వివరించారు. సాధించిన ఘనత చాటి చెప్పేందుకు అబ్జర్వేషన్ బుక్స్ అసెస్మెంట్ కార్డులను అందజేశారు. ఈ యాన్యువల్ డే లో చిన్నారుల ఆటపాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్ వాడి టీచర్ శ్యామల, ఆయా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అధ్యక్షా.. ఎందుకు నీకు చెట్లు అంటే అంత కక్ష..?

- ఏండ్ల నాటి చెట్లు నరికివేత
- బీహెచ్ఈఎల్ మాక్ సొసైటీ పార్క్లో కొనసాగుతున్న వివాదం
- పదిహేను రోజులు గడిచినా అధికారుల మౌనం!
- నరికిన చెట్ల మొద్దులు ఎక్కడ..? కొత్త అనుమానాలు

రామచంద్రపురం, ఏప్రిల్ 25, (సిరి న్యూస్):





భారతి నగర్ డివిజన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ మాక్ సొసైటీ పార్క్లో చెట్ల నరికివేత వివాదం రోజురోజుకు ముదురుతోంది. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు సంబంధిత అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం పలు అను మానాలకు తావిస్తోంది.ఏండ్ల నాటి పెద్ద చెట్లను అకస్మాత్తుగా నరికివేయడంతో పార్క్లోని పచ్చదనం తీవ్రంగా దెబ్బతింది. పర్యావరణానికి కీలకమైన ఈ వృక్షాలను తొలగించడం వెనుక అసలు ఉద్దేశ్యం ఏమిటన్నది ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది.స్థానికుల ఆరోపణల ప్రకారం, సరైన అనుమతులు లేకుండానే చెట్లను తొలగించినట్లు తెలుస్తోంది. "పార్క్ అంటే ప్రజలకు ఆక్సిజన్లాంటి ప్రదేశం... అలాంటి చోట చెట్లు నరికేస్తే పిల్లల భవిష్యత్తు ఏమవుతుంది?" అంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇదిలా ఉండగా, ఘటన జరిగి పదిహేను రోజులు గడిచినా అధికారులు స్పందించకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. చెట్ల నరికివేతకు ఎవరు అనుమతి ఇచ్చారు? ఎవరి ఆదేశాలతో ఈ చర్యలు చేపట్టారు? అన్న ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం లేకపోవడం స్థానికుల్లో ఆగ్రహాన్ని పెంచుతోంది.ఇక మరో కీలక అంశం కూడా వెలుగులోకి వచ్చింది. నరికిన చెట్ల మొద్దులు ఎక్కడికి తరలించారన్నది ఇప్పటికీ స్పష్టత లేకుండా ఉంది. పార్క్లో నరికిన చెట్ల అవశేషాలు కనిపించకపోవడం అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. ఈ మొద్దులను ఎవరికి అప్పగించారు? విక్రయించారా? లేక మరెక్కడికైనా తరలించారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రధానంగా మారాయి.ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్ల నరికివేతపై వివాదాలు చెలరేగుతున్న నేపథ్యంలో, ఈ ఘటన కూడా అదే దిశగా సాగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించి చెట్ల తొలగింపు జరగడం చట్ట విరుద్ధమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఈ నేపథ్యంలో కాలనీ వాసులు తక్షణమే పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే పార్క్లో మళ్లీ మొక్కలు నాటి పచ్చదనాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. స్పందన లేకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు

# ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- గుమ్మడిదలలో ప్రపంచ మలేరియా దినోత్సవం అవగాహన ర్యాలీ

గుమ్మడిదల, ఏప్రిల్ 25 (సిరి న్యూస్ ):




గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మలేరియా వ్యాధి వ్యాప్తి దోమ కాటు ద్వారా జరుగుతుందని ప్రపంచానికి తెలియజేసిన శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ జన్మదినాన్ని గుర్తు చేసుకుంటూ మలేరియా దినోత్సవం సందర్భంగా గుమ్మడిదల ప్రాథమిక వైద్యాధికారి మధుకర్ ఆధ్వర్యంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ చిన్న పాపని కుమార్ గౌడ్, తహసిల్దార్ పరమేశం ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా దోమల పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు. కూలర్లు, పూల తొట్లు వంటి చోట్ల నీరు నిల్వ ఉండకుండా ప్రతి వారం శుభ్రపరచాలని సూచించారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో దోమలు ఎక్కువగా ఉండే కారణంగా కిటికీలు, తలుపులు మూసి ఉంచడం, దోమతెరలు ఉపయోగించడం అవసరమని చెప్పారు. మలేరియాతో పాటు డెంగ్యూ, చికెన్ గునియా, ఫైలేరియా వంటి అనేక వ్యాధులు కూడా దోమల ద్వారా వ్యాప్తి చెందుతున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే ఈ వ్యాధులను పూర్తిగా నిర్మూలించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజశేఖర్, రాజారెడ్డి, రమేష్, నాయకులు పుట్టా నర్సింగ్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మైపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కృష్ణ, హుస్సేన్, ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డి, మద్ది భాస్కర్ రెడ్డి, మల్లారెడ్డి హాస్పిటల్ తరఫున డాక్టర్ నిహారిక, వైద్య విద్యార్థులు, హెచ్ఈఓ శ్రీనివాస్, ఎంఎల్హెచ్పీలు కళ్యాణి, భాగ్య, రేవంత్, సభా ఆఫ్రీన్, ఏఎన్ఎంలు స్వరూప, ఎస్టర్, శశికళ, వసంత, వసుంధర, సుబ్రహ్మణ్యం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, ఐకేపీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# నల్లకుంట చెరువు రసాయన కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

- చైర్మన్,కమిషనర్కు వినతిపత్రం

గుమ్మడిదల, ఏప్రిల్ 25 ( సిరి న్యూస్ ):



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో ఉన్న నల్లకుంట చెరువులో జరుగుతున్న రసాయన కాలుష్యంపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దోమడుగు కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు గుమ్మడిదల పురపాలక సంఘం చైర్మన్ కుమార్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ దశరథకు శనివారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ సమస్యపై గతంలోనే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరాలు వెల్లడించలేదని కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది నెలలుగా నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు సరైన సమాచారం అందించలేదని తెలిపారు. సమస్యను ప్రస్తావించినప్పుడు కొన్ని సందర్భాలలో బెదిరింపులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా చెరువులో జరుగుతున్న రసాయన కాలుష్యంపై తక్షణ విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని, ఒకవేళ చర్యలు తీసుకోకపోతే దానికి గల కారణాలను కూడా స్పష్టంగా వెల్లడించాలని కోరారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని కమిటీ సభ్యులు కోరారు.

# పేదలకు పని కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర

- ఉపాధి హామీ పనుల పరిశీలన
- సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్

గుమ్మడిదల, ఏప్రిల్ 25 ( సిరి న్యూస్ ):



గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం పనులను గ్రామ సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి కార్మికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడంలో ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రతి అర్హుడికి పనివేళలు కల్పించడం, వారికి సరైన వేతనాలు అందేలా చూడడం లక్ష్యమని తెలిపారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుత వేసవి తీవ్రత దృష్ట్యా పనుల్లో పాల్గొంటున్న కార్మికులకు త్రాగునీరు, మజ్జిగ, అవసరమైన వైద్య సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్మికుల ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎండ తీవ్రతలో పనిచేస్తున్న కార్మికులు జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతే విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. గ్రామంలో జరుగుతున్న పనులను నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా





- అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయం.
- సంక్షేమ పథకాలతో..ప్రజల జీవితాల్లో మార్పు.
- ప్రభుత్వ కేంద్రాల్లోనే..రైతుకు మద్దతు ధర,
- పేదల కళ్ళల్లో ఆనందమే.. కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం.
- ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు.

రామాయంపేట,(నిజాంపేట) ఏప్రిల్ 25(సిరి న్యూస్):

పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. నిజాంపేట మండల కేంద్రంలోని రైతు వేదిక లో శనివారం రోజున కల్యాణ లక్ష్మి, షాదీ భూబారక్ మంజూరైన 33 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ముందుగా చల్మెడ, కల్వకుంట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అలాగే మండల కేంద్రంలోని కంది పద్మ- దుబ్బరాజులకు చెందిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరై గృహ లబ్ధిదారులకు వస్త్ర కానుకలను అందించి మాట్లాడారు రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని విక్రయించాలన్నారు. అలాగే నిరుపేదల కుటుంబాలు ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ అసలైన లక్ష్యమని, సొంతింటి కల ప్రతి పేద కుటుంబానికి చేరడమే మా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లను మంజూరు చేస్తామని, నూతనంగా గృహప్రవేశం చేసిన కంది పద్మ దుబ్బరాజులకు హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి సి ఓ కరుణాకర్, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాజిరెడ్డి, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు భాను ప్రకాష్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచు మల్లేశం, ఉప సర్పంచు మహేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కొమ్మట బాబు, మాజీ ఎంపీపీ సిద్ధ రాములు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అమర్ సేనా రెడ్డి, మాజీ సర్పంచులు ముత్యం రెడ్డి, సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు పంజా మహేందర్, నసీరోద్దీన్, వై వెంకటేశం తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవారికి సొంతింటి కల నెరవేరడం తథ్యం

- మహిళలను అభివృద్ధి ప్రభుత్వం కృషి
- 597కళ్యాణ లక్ష్మి, 50 షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ
- ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమం
- మంత్రి వివేక్ వెంకటస్వామి



నర్సాపూర్ ఏప్రిల్ 25 (సిరి న్యూస్)

ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం నర్సాపూర్ సాయి కృష్ణ ఫంక్షన్ హాల్ లో కళ్యాణ లక్ష్మి షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు , భూగర్భ శాస్త్ర మంత్రిత్వ శాఖల మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు ఆయన తోపాటు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి ఉన్నారుఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీము బారక్ పథకం పేదింటి ఆడపిల్లల పాలిట వరం ప్రజల సమస్యలను పరిష్కరించి వారికి మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రజాపాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జిల్లాలో పటిష్టంగా నిర్వహిస్తున్నాము ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న వారికి బిల్లుల సమస్యలపై తొందరలో ప్రత్యేక సమావేశం ద్వారా చర్యలు చేపడతామని ప్రజలందరూ సన్న బియ్యంతో భోజనం చేయాలని ఉద్దేశంతో 9,000 కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాము. రైతులకు సన్న వడ్ల 500 రూపాయల బోనస్ మంజూరు చేయడంతో పాటు రైతు రుణమాఫీ పథకం ద్వారా వారికి ఆర్థిక చేయూత అందిస్తున్నాము. అలాగే ఆర్టీసీ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కోసం 9 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్న నేపథ్యంలో వారి డిమాండ్లకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక చేయూత అన్నారు ప్రస్తుత రోజుల లో అమ్మాయిలు బాగా చదువుకుని అన్ని రంగాలు రాణిస్తున్నారని ఈ పథకాన్ని నియోజకవర్గంలో పటిష్టంగా అమలు పరచాలని అన్నారు కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళిక లో భాగంగా అభివృద్ధి సంక్షేమ పథకాల ప్రజలకు చేరువ చేయడానికి జిల్లాలో సమర్థవంతంగా కార్యక్రమాలు చేపడుతున్నమని అన్నారు కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులతో పాటు ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం, పారిశుద్ధ్యం పై ప్రత్యేక చర్యలు, ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు, బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ విద్యను బలోపేతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో పాలనాపరంగా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీ రాజ యాదవ్ , సంబంధిత ఉద్యోగులు ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# హైటెన్షన్ రోడ్డు ప్రయాణానికి ఫుల్ టెన్షన్

- రోడ్డు వెడల్పు పనుల్లో తాత్సారం నెలల కొద్దీ సాగుతున్న పనులు.
- నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు
- ఆల్వాల్ ప్రజలకు నరకప్రయాణం ప్రధాన రహదారికి ఈ రోడ్డె మార్గం
- చెట్ల నరికివేత ఫుట్పాత్ ల కూల్చివేత
- రోజుకోచోట తవ్వకాలు తవ్విన చోట సాగని పనులు

ఆల్వాల్ సిరి న్యూస్ ఏప్రిల్ 25:

ఆల్వాల్ హైటెన్షన్ రోడ్ ఇపుడు ప్రయాణికులకు పెద్ద టెన్షన్ గా మారింది. 2.5కిలోమీటర్ల మేర విస్తరించిన ఈ రోడ్ ఆల్వాల్ హిల్స్ , మంజీరా కాలనీ , సిటిజెన్ కాలనీ ,పంచశీల నుండి సుచిత్ర వెళ్లేందుకు ప్రధాన రహదారి. ఇప్పుడు నెల రోజులుగా ఈ రోడ్ స్థానిక ప్రజల పాలిట శాపంగా మారింది. ఈ రోడ్ నిర్మాణానికి 4.5కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయ్. ఈ నిధుల ద్వారా హై టెన్షన్ మార్గంలో రెండు వైపులా రోడ్ వెడల్పు చేపడుతూ సీసీ రోడ్ నిర్మాణం చేపట్టాలి.కానీ రోడ్ వెడల్పు సైతం ఇక్కడ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా మారింది. నిబంధనల ప్రకారం ఒకే రీతిలో రోడ్ వెడల్పు జరగాలి కానీ కొన్నిచోట్ల స్థానికులు కోర్టులకు వెళ్లడం మరి కొన్ని చోట్ల రాజకీయ వత్తిళ్లతో రోడ్ వెడల్పు పనులు జరగడంలేదు. ఒక్కోచోట ఒక్కో రీతిలో రోడ్ వెడల్పు చేస్తుండటం పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డు తవ్వుతారు ఆపై వదిలేస్తారు

కొత్తగా వేస్తున్న రోడ్ పనుల్లో సైతం ఆలస్యం జరుగుతోంది. నిత్యం వేలాది వాహనాలు వెళ్లే ఈ దారిలో ఒక ప్రణాళిక ప్రకారం రోడ్డును తవ్వాల్సి ఉండగా కాంట్రాక్టర్ మాత్రం తవ్విన మట్టిని ఇంకోవైపు వేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు.అసలే ఒకవైపు సీసీ కోసం రోడ్ తవ్వడం ఆ మట్టిని మరోవైపు వేయడం మూలంగా రోడ్ చిన్నది కావడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయ్. ఉదయం సాయంత్రం ఈ దారిలో వెళ్లాలంటే నరకం చూడాల్సిందేనని ప్రజలు వాపోతున్నారు.



### అధికారుల పర్యవేక్షణ లోపం

హై టెన్షన్ రోడ్ పనులవల్ల ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. సహజంగా పిర్యాదులు వస్తే స్పందించే అధికారులు కనీసం ఇటు వైపు తిరిగి చూడటం లేదని స్థానికులు వాపోతున్నారు,

### క్యూరింగ్ కూడా సరిగా లేదు

ఏదైనా కాంక్రిట్ పనులు చేస్తే అవి స్థిరంగా ఉండటానికి క్యూరింగ్ చేయాలి. కానీ ఇక్కడ ఈ రోడ్ పనుల్లో మాత్రం సీసీ వేసిన చోట తూతూ మంత్రంగా క్యూరింగ్ చేస్తున్నారు. సీసీ వేసాక నెలపాటు జరగాల్సిన క్యూరింగ్ పట్టుమని పక్షం కూడా జరగడంలేదని స్థానికుల ఆరోపణ

### రోడ్డు కోసం చెట్లు నరికారు

హై టెన్షన్ రోడ్ వెడల్పులో కాంట్రాక్టర్ అత్యుత్సాహం మూలంగా పదుల సంఖ్యలో వృకాలు నేలకొరిగాయి. ఒక వైపు కాంక్రిట్ నగరమైన ప్రస్తుత పట్టాన వ్యవస్థలో పర్యావరణానికి చెట్లు మూలాధారం అలంటి చెట్లు ఎన్నో నరికి వేశారు. కానీ ఒక్క అటవీశాఖ అధికారులు మాత్రం ఇటు వైపు తొంగిచోడలేదు. ఒక చిన్న చెట్టు కొమ్మ నరికితే వచ్చే అటవీశాఖ అధికారులు రాకపోవడం వెనక మతలబేంటో అర్థం చేసుకోవచ్చు

### రోడ్డు వెడల్పులు కోటి నిధులు బుగ్గిపాలు

హై టెన్షన్ రోడ్ వెడల్పులో భాగంగా గత ఏడాదే నిర్మించిన ఫుట్పాత్ లను కూల్చేశారు. కొత్త రోడ్ వెడల్పు నిధులు మంజూరు కాకమునుపు ఇక్కడ ఇరువైపులా టైల్స్ వేసి ఫుట్ పాత్ నిర్మించారు దాదాపు కోటి మున్సిపల్ నిధులతో నిర్మించిన ఫుట్ పాత్ ను ఏడాదికే రోడ్ వెడల్పు పేరా కూల్చడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఇకనైన మేల్కొంటే బాగుండు

హై టెన్షన్ రోడ్ వెడల్పు పనుల్లో అటు నాణ్యత విషయంలో అధికారులు శ్రద్ధ చూపాలని పనులు త్వరిత గతిన పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఇందుకోసం అధికారులు ఇకనైనా మేల్కొని ప్రజల ఇబ్బందులను తొలగించాలన్నది స్థానికుల వాదన

## పైసర గ్రామానికి కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేసిన సర్పంచ్



కొల్చారం ఏప్రిల్ 25 (సిరి న్యూస్)

కొల్చారం మండల పరిధిలోని పైతర గ్రామ సర్పంచ్ యూత్ ఐకాన్ రవితేజ రెడ్డి తమ గ్రామానికి కల్యాణ లక్ష్మి చెక్కులు నర్సాపూర్లో ఇవ్వడంతో లబ్ధిదారులకు తన చేతుల మీదుగా అందజేశారు తెలంగాణ రాష్ట్ర సమితి ఉన్నప్పుడే అప్పటి గౌరవ ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు 50 వేల రూపాయల నుండి లక్ష వరకు పెంచిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి లేనని కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా తులం బంగారం ఇస్తామని మహిళలు మోసం చేసిందని రానున్న ఎన్నికలలో భారతీయ రాష్ట్ర సమితి ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు

## ఆత్మహత్యకు పాల్పడ్డ నరేందర్ గౌడ్

కొల్చారం, ఏప్రిల్ 25,( సిరి న్యూస్)



కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామానికి చెందిన శేగ్గారీ నరేందర్ గౌడ్ (49) కొడిపల్లి శివారులోని బట్టమ్మగుడి వెనకాల 100మీటట్ల పరిధిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఇటీవల తమ ఇద్దరు కూతుర్ల వివాహం కావడంతో చేసిన అప్పులు ఎక్కువ కావడంతో మనస్థాపం చెంది ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య నాగమణి ఇద్దరు కూతుళ్లు కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు

## తెల్లాపూర్ లో ఘనంగా హిందూ సమ్మేళనం

హనుమాన్ చాలీసా పారాయణం



రామచంద్రపురం, ఏప్రిల్ 25 (సిరి న్యూస్):

హిందూ బంధువులు ఐక్యతతో తెల్లాపూర్ వేదికగా హిందూ సమ్మేళనం, హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం ప్రాంగణంలో, బీరప్ప దేవస్థానం వద్ద భక్తిశ్రద్ధలతో జరిగింది.ఈ వేడుకలకు రాధా మనోహర్ దాస్ స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై ఆధ్యాత్మిక సందేశాన్ని అందించారు. జర్నలిస్టు, సోషల్ యాక్టివిస్ట్ దేవికా రెడ్డి పాల్గొని సమాజంలో ఐక్యత అవసరాన్ని వివరించారు. ముఖ్య వక్తగా భాగ్యనగర్ గేటెడ్ కమ్యూనిటీస్ ప్రచారక్ ఓం ప్రకాష్ జీ హిందూ ధర్మ పరిరక్షణపై ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ భారతి నగర్ డివిజన్కు చెందిన సీనియర్ నాయకులు కంజర్ల కృష్ణమూర్తి, సునంద తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించి, దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించారు.

## ప్రజల దాహార్తికై వెంకటాపూర్ లో చలివేంద్రం ఏర్పాటు




రామాయంపేట, (నిజాంపేట) ఏప్రిల్ 25(సిరి న్యూస్):

వేసవి నేపథ్యంలో బాటసారులకు, ప్రయాణికులకు, రైతులకు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని గ్రామ సర్పంచు సరిత మధుసూదన్ రెడ్డి తెలిపారు. నిజాంపేట మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో శనివారం రోజున స్థానిక బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు .నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, ఉప సర్పంచ్ గజం ప్రవీణ్, సభ్యులు మహేష్, జనగామ స్వామి, అశోక్, చంద్రకళ, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్ రెడ్డి, భాస్కర్ గౌడ్, ప్రవీణ్ కుమార్ గౌడ్, జల స్వామి, ఐకెపి నిర్వహకురాలు కవిత, లావణ్య తదితరులు ఉన్నారు.

# ఏఐఎఫ్టీపి రాష్ట్ర ఇంచార్జీ గా రామరాజు విఠల్

మెదక్ ప్రతినిధి,ఏప్రిల్25(సిరి న్యూస్)




అఖిల భారత పన్ను ప్రాక్టీషనర్ల సమాఖ్య(ఏఐఎఫ్టీపి)రాష్ట్ర ఇంచార్జ్ గా ప్రముఖ న్యాయవాది రామరాజు విఠల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.మెదక్ పట్టణంలోని బ్రాహ్మణ వీధి కి చెందిన రామరాజు విఠల్ ను శనివారం బెంగుళూరు గ్రీన్ పార్క్ ఆర్గానిక్ హోటల్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దక్షిణ భారత విభాగానికి చెందిన తెలంగాణ రాష్ట్ర ఇంచార్జీగా ఉన్న చైర్మన్ డి. ఎం. భట్టాడ్ సభ్యుల ఏకగ్రీవంతో నియమించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐఎఫ్టీపి జాతీయ అధ్యక్షుడు సి.ఏ. ఎస్. వెంకట రమణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విఠల్ కు సభ్యులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుబ్రహ్మణ్య కుద్లు, కోశాధికారి విజయన్, తెలంగాణ సంయుక్త కార్యదర్శి నగేష్ రంగి తదితరులతో పాటు పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమం కోసమే ట్రస్ట్ ఏర్పాటు

**నిరంతరం ప్రజలలో ఉంటూ ప్రజల క్షేమం కోరడమే లక్ష్యం**

**వ్యక్తిగత విమర్శలు మానుకోండి**

**సి జి ఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**



గుమ్మడిదల, ఏప్రిల్ 25 ( సిరి న్యూస్):

ప్రజల సంక్షేమం కోసమే ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని నిరంతరం ప్రజలలో ఉంటూ ప్రజల క్షేమం కోరడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని సి జి ఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం సిజిఆర్ ట్రస్ట్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సీజీఆర్ కార్యాలయం సాధారణ కార్యాలయం కాదని, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించే జనతా గ్యారేజ్ లా పనిచేస్తోందని తెలిపారు. పార్టీలకు అతీతంగా 24 గంటల పాటు ప్రజలకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను చెప్పుకుంటే తక్షణ పరిష్కారం చూపే విధంగా వ్యవస్థ పనిచేస్తోందని వివరించారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని అన్నారు. ప్రజల్లో విశ్వాసం పొందాలంటే ప్రజల మధ్యలో ఉండి పని చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ పఠాన్‌చెరు నియోజకవర్గంలో ఐదు మున్సిపాలిటీల్లో గులాబీ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని గుర్తుచేశారు. గుమ్మడిదల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. తమ నాయకత్వం ప్రజల విశ్వాసాన్ని ఎప్పటికప్పుడు నిలబెట్టుకుంటోందని తెలిపారు. పదవీకాలాన్ని పూర్తి చేసి మళ్లీ ప్రజల ఆశీర్వాదంతో గెలుస్తున్నామని పేర్కొన్నారు. పఠాన్‌చెరు ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని, గుమ్మడిదలలో సీజీఆర్ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. జీఎంఆర్ తమకు పెద్దన్నలాంటి వ్యక్తి అని వ్యాఖ్యానించారు. ప్రజల సేవే తమ ప్రధాన లక్ష్యమని, అనవసర రాజకీయాలు పక్కనబెట్టి అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాలని అన్ని పార్టీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు అబిశెట్టి రాజశేఖర్, సంజీవరెడ్డి, కిషన్, యువ నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, మద్ది శేఖర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సత్యనారాయణ, రవి, శేఖర్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలి

- **మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్**

ఆసిఫాబాద్ టౌన్ (సిరి న్యూస్)::



పట్టణంలోని 17వ వార్డులో శనివారం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, మున్సిపల్ కమిషనర్ గజానంద్ వార్డులో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించడంతో పాటు ప్రజలకు తడి చెత్త ,పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని, ఇంటి వద్దే చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించుకోవచ్చని పిలుపునిచ్చారు. ప్రగతి ప్రణాళిక లక్ష్యం ప్రజలకు మెరుగైన సేవలు అందించడమేనని, పారిశుద్ధ్య కార్మికులకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాలం బిన్ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ జావిద్, మున్సిపల్ అధికారులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలి

- **కిచెన్ గార్డెన్ లేకపోతే సిడిపిఓపై చర్యలు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు హెచ్చరిక.**

రామాయంపేట, ఏప్రిల్ 25(సిరి న్యూస్)





చిన్నపిల్లలకు సకాలంలో పౌష్టికాహారం అందజేయాలని ,అలాగే కిచెన్ గార్డెన్ లేకపోతే సిడిపిఓపై చర్యలు తీసుకుంటామని మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు హెచ్చరించారు.పౌష్టికాహార ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి బలమైన పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. శనివారం రామాయంపేట పట్టణంలోని వినాయక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పోషణ పక్వాడ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ మానవ జీవనంలో ఆహారపు అలవాట్లు ఆరోగ్య స్థితిగతులను ఎలా ప్రభావితం చేస్తాయో వివరించారు. ముఖ్యంగా కరోనా వంటి విపత్కర కాలంలో మన సంప్రదాయ ఆహారపు అలవాట్లే మనల్ని రక్షించాయని గుర్తు చేస్తూ, భవిష్యత్ తరాలకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.అంగన్వాడీ కేంద్రాల పనితీరుపై ఎంపీ ప్రత్యేక దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో అంగన్వాడి కేంద్రాల్లోనే ఆకుకూరలు మరియు పోషక విలువలు కలిగిన కూరగాయలను పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిడిపిఓలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ పాలనలో జవాబుదారీతనాన్ని గుర్తు చేశారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోషణ పక్వాడ్ కార్యక్రమం ఎంతో అభినందనీయమని, ఇది క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కూడా పాల్గొని ప్రసంగించారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల సంక్షేమం కోసం అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అమలు చేస్తున్న వివిధ పథకాలు పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని ఆయన కొనియాడారు. అనంతరం ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తల కోసం మంజూరు చేసిన నూతన సెల్‌ఫోన్లను ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. డిజిటల్ పద్ధతిలో అంగన్వాడీ సేవలను మరింత వేగవంతం చేసేందుకు ఈ ఫోన్లు ఉపయోగపడతాయని వారు తెలిపారు. అంతకుముందు స్థానిక విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించి వారికి ప్రోత్సాహాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు మరియు అంగన్వాడీ సిబ్బంది భారీ సంఖ్యలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రజనీ కుమారి, ఎంపీడీవో షాజీలుద్దీన్, ఎంఈఓ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోచమ్మ గణేష్, బైరం స్వప్న కుమార్, దేవుని రంజిత్, పుట్టి సందీప్, రవి నాయక్, శంకర్ గౌడ్, సర్పంచులు బక్కయ్య గారి యాదగిరి, మానేగాల రామకృష్ణయ్య, వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చింతల స్వామి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండారు మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దేమే యాదగిరి, చింతల యాదగిరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పోచమ్మల గణేష్, పార్టీ నాయకులు ఎనీశెట్టి అశోక్ గుప్తా, సుంకోజు దామోదర్ తో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.



# అంగన్వాడి కేంద్రాలలో పారదర్శకంగా సేవలు





- **కేంద్రాలకు అత్యాధునిక స్మార్ట్ ఫోన్లు పంపిణీ**
- **వివరాలను ఆన్లైన్లో నమోదు**
- **అంగన్వాడి కేంద్రాలను ఆధునికరించే విధంగా పటిష్ఠ చర్యలు**
- **మంత్రి వివేక్ వెంకటస్వామి**

నర్సాపూర్ ఏప్రిల్ 25 (సిరి న్యూస్)

అంగన్వాడీ కేంద్రాల పనితీరును మరింత ఆధునికీకరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటుందని భూగర్భ మంత్రిత్వ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సేవలను పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం అత్యదునిక స్మార్ట్ ఫోన్లను అందిస్తుంది శనివారం నర్సాపూర్ సాయి కృష్ణ ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ గ్రంథాలయ చైర్మన్ సువాసిని రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్ జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి తో మంత్రి అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ చేశారు. అనంతరం అంగన్వాడి పిల్లలకు యూనిఫాం అందించారు.1098 చైల్డ్ హెల్ప్ లైన్ పోస్టర్ను ప్రారంభించారు.

**ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ**

అంగన్వాడీ కేంద్రాలలో కార్యకలాపాలను డిజిటలైజ్ చేయడం ద్వారా సేవలలో వేగం పెరుగుతుందని అన్నారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, ఆరోగ్య సేవలను ఈ స్మార్ట్ ఫోన్ల ద్వారా మరింత పారదర్శకంగా, ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని సాంకేతిక ద్వారా అంగన్వాడీ టీచర్ల బాధ్యతలను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని అన్నారు ఈకార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ టీచర్లు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# నల్లకుంటను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతాం

- **నల్లకుంట చెరువులోకి కాలుష్యం రాకుండా అడ్డుకుంటాం**
- **చైర్మన్ కుమార్ గౌడ్**

గుమ్మడిదల, ఏప్రిల్ 25 (సిరి న్యూస్):



దోమడుగు నల్లకుంట చెరువులలోకి వదులుతున్న రసాయన పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తెలిపారు. గుమ్మడిదల పురపాలక సంఘం పరిధిలో ఉన్న దోమడుగు నల్లకుంట చెరువుపై గ్రామస్తుల చేసిన ఫిర్యాదుపై మున్సిపల్ చైర్మన్ స్పందిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే పరిశ్రమలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కాలుష్యానికి గురైన నల్లకుంట చెరువును రక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాబోయే రోజుల్లో చెరువును శుభ్రపరచి మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతాన్ని పచ్చదనం, ఆహ్లాదకర వాతావరణంతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. భవిష్యత్తులో చెరువులోకి కాలుష్యం రాకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, దీనిపై మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ ప్రాంతాలకు ప్రత్యేకంగా సిఎస్ఆర్ నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ పరిశ్రమ అయినా తమ లాభాల్లో కొంత శాతాన్ని సామాజిక బాధ్యత సిఎస్ఆర్ కింద ఖర్చు చేయాల్సి ఉంటుందని ముఖ్యంగా పరిశ్రమల కారణంగా ఏ ప్రాంతం అయితే కాలుష్యానికి గురై నష్టపోతుందో అక్కడ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సిఎస్ఆర్ నిధులను ఖచ్చితంగా వెచ్చించాల్సిందేనని స్పష్టం చేశారు. ఇది ఆయా సంస్థల చట్టబద్ధమైన బాధ్యత అని దీనిని విస్మరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. బాధ్యులైన పరిశ్రమల యజమానులతో మాట్లాడి నష్టపోయిన గ్రామాల అభివృద్ధికి ఈ నిధులను వినియోగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అభి శెట్టి రాజశేఖర్, నర్సంపల్లి రాజారెడ్డి, నాయకులు మద్ది శేఖర్ రెడ్డి, బాల్ రెడ్డి, మంగయ్య, హుస్సేన్, కాలుష్య వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# కాలుష్య కాటుకు గ్రామాలు విలవిల





- **నల్లబడ్డ నీరు విలవిలలాడుతున్న గ్రామాలు**
- **ఫ్యాక్టరీల పై గ్రామస్తుల యుద్ధం**
- **పరిశ్రమల విషం ప్రజలకు కష్టం...**
- **కాలుష్యంపై పిసిబికి ... ఎమ్మెల్యేకు ఫిర్యాదు**

**జిన్నారం ఏప్రిల్ 25 సిరి న్యూస్**

జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని కాజిపల్లి ధర్మీ చెరువు కాస్త కాలుష్య జలాలకు చేపలు మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులు బగ్గుమన్నారు. గడ్డపోతారం మున్సిపాలిటీకి చెందిన ప్రజలు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి– కి మరియు పిసిబి ఈ ఈ కుమార్ పాటక్, మరియు తాసిల్దార్ దేవదాసు కు శనివారం గ్రామస్తులంతా కలిసి ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... మా ఊపిరి తీయకండి కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు మండిపడుతున్నారు. కాలుష్య కాటుకు రసాయన నీటి వల్ల పంట పొలాలు చవిటి నేలలుగా మారుతు న్నాయి.చెరువులు, కుంటలు,కాలుష్యంతో నిండి దర్శనమిస్తున్నవి. విషపూరిత జలాలను వదులుతున్న పరిశ్రమలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రసాయనాల వల్ల భూగర్భ జలాలు కలుషితమై చేతి పంపులు, బోరుబావుల నుండి వచ్చే నీరు రంగు మారి దుర్వాసన వస్తుంది, అని పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని పిసిబి యంత్రాంగం. పశువులు ఈ నీటిని తాగి మృత్యువాత పడ్డ సందర్భాలు ఎన్నో ఉన్నాయి. నిత్యం దుర్వాసన, గాటైన రసాయనాల వల్ల గ్రామస్తులు కనీసం ఊపిరి తీసుకోలేకపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని వాపోతున్నారు. చిన్నారులు, వృద్ధులు, చర్మవ్యాధులతో మరియు కంటి సమస్యలతో శ్వాసకోస వ్యాధులతో ఇబ్బందులకు గురవుతున్నారు. పరిశ్రమల నుండి వెలువడే పొగ వల్ల, పరిసర ప్రాంతాలు గాలి నాణ్యత పూర్తిగా పడిపోయిందని అన్నారు. గ్రీన్ బెల్ట్ లేకపోవడం నిబంధనల ప్రకారం పరిశ్రమల చుట్టూ ఉండాల్సిన చెట్లు ఎక్కడ కనిపించడం లేదు అని తెలిపారు.పిసిబి నిబంధనలను బేఖాదార్ చేస్తూ, కేవలం పరిశ్రమల యాజమాన్యాలు ఇచ్చే ముడుపులకు వత్తాసు పలుకుతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గద్దె గణేష్, ఆకుల నవీన్ కుమార్ , మల్లేష్ ముదిరాజ్, సురేష్ అశోక్ , బాబు, జనార్దన్, ఖదీర్, శ్రీకాంత్ గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# టీ పాయింట్లో అగ్నిప్రమాదం

- **అప్రమత్తమైన జనం..తప్పిన ప్రమాదం.**

**రామాయంపేట,(నిజాంపేట) ఏప్రిల్ 25(సిరి న్యూస్):**

నిజాంపేట మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం జరిగిన అగ్నిప్రమాదంలో ప్రమాదం తప్పింది. స్థానిక ఏకే టీ పాయింట్లో గ్యాస్ సిలిండర్ లీక్ అవ్వడం కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్పందించిన స్థానికులు పక్కనే ఉన్న పెట్రోల్ బంక్ నుండి ఫైర్ సేఫ్టీ సిలిండర్లు తెచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో షాపులోని వస్తువులు దగ్ధమవగా, ప్రాణనష్టం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రామాయంపేట నుండి ఫైర్ ఇంజన్ సిబ్బంది, నిజాంపేట పోలీసులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు



# ఎమ్మెల్యే జిఎంఆర్‌ను పరామర్శించిన హరీష్ రావు

**రామచంద్రపురం,(పటాన్చెరు), ఏప్రిల్ 25, (సిరి న్యూస్):**

ఇటీవల కార్యాలయంలో జారిపడి స్వల్ప గాయాలపాలైన పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) ప్రస్తుతం నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, చింతా ప్రభాకర్ కూడా హరీష్ రావుతో కలిసి జిఎంఆర్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకొని తిరిగి ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు.నిరంతరం ప్రజల మధ్య ఉండి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న జిఎంఆర్ త్వరగా ఆరోగ్యంగా మారాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమాన్ని మరిచారా..?

- **లచ్చన్నగూడెంలో రాజుకుంటున్న ఇరువర్గాల కూల్ వార్**
- **విద్యుత్ అధికారులకు తలనొప్పిగా మారిన వివాదం**

**సత్తుపల్లి సిరి న్యూస్:** సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలోని లచ్చన్నగూడెం గ్రామంలో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి పురేటి శ్రీనివాస్‌పై ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన పోతురాజు చక్రధర్ రావు 49 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అదేవిధంగా ఉప సర్పంచ్ స్థానాన్ని కాంగ్రెస్ అభ్యర్థి గెలుచుకున్న విషయం విదితమే. అయితే ఈ గ్రామంలో రాజకీయ పార్టీల మధ్య కొనసాగుతున్న కూల్ వార్ కారణంగా ప్రజా సంక్షేమ పనులు అడ్డంకులకు గురవుతున్నాయని తెలుస్తోంది. దీంతో గ్రామ అభివృద్ధి పనులు మందగిస్తున్న పరిస్థితి నెలకొంది. యాదవ కులస్తుల వీధికి వెళ్లే దారి వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటంతో ప్రమాదం జరగకుండా ఉండాలనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ గొడ్డటి అంకారావుతో మాట్లాడి కొత్త స్తంభం ఏర్పాటు చేయించి, తీగలను ఎత్తుగా అమర్చే చర్యలు చేపట్టారు. ఈ విద్యుత్ స్తంభం ఏర్పాటు విషయాన్ని కొందరు రాజకీయ నాయకులు వ్యతిరేకిస్తూ, స్తంభాన్ని తొలగించాలని ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. దీంతో విద్యుత్ శాఖ అధికారులకు ఈ వివాదం తలనొప్పిగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. "కరవమంటే కప్పకు కోపం, వదలమంటే పాముకు కోపం" అన్నట్లుగా అధికారులు ఇరువర్గాల మధ్య ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి నెలకొంది. ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ చొరవ తీసుకుని సమస్యను సానుకూలంగా పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# ఎన్ సీడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు

**మందమర్రి సిరి న్యూస్:** మందమర్రి ఏరియాలోని సీఈఆర్ క్లబ్‌లో ఎన్ సీడబ్ల్యూఏ ఉద్యోగులకు శనివారం కౌన్సిలింగ్ నిర్వహించి సీనియార్టీ ప్రాతిపదికన క్వార్టర్లు కేటాయించారు. సింగరేణి అధికారి డీజీఎం కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 93 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, వాటి కోసం 158 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. నియమ నిబంధనల ప్రకారం పారదర్శకంగా కౌన్సిలింగ్ నిర్వహించి 19 మంది అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, మేనేజ్మెంట్ ట్రైనీ సివిల్ ఆర్.వీణ కేటాయింపు ప్రక్రియను పర్యవేక్షించారు. కౌన్సిలింగ్ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు వివరించారు.





## సంపాదకీయం

# తెలంగాణ వర్తమానం సవాళ్లు.. పరిష్కారాలు

తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం ఒక కీలకమైన దశలో ఉంది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కొత్త ప్రభుత్వం తన హామీలను నెరవేర్చే క్రమంలో అనేక పాలనాపరమైన సామాజిక సవాళ్లను ఎదుర్కొంటోంది. రాష్ట్రంలోని తాజా పరిస్థితులను విశ్లేషిస్తే ప్రధానంగా కార్మిక అసంతృప్తి, వ్యవసాయ రంగ సంక్షేమం, రాజకీయ మార్పులు చర్చనీయాంశాలుగా మారాయి. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న అత్యంత ఆందోళనకరమైన పరిస్థితి ఆర్టీసీ కార్మికుల సమ్మె. వరంగల్ జిల్లా నర్సంపేట డిపోకు చెందిన డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనపై రాజకీయ పక్షాల మధ్య విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, కార్మికులు ఎవరూ ప్రాణత్యాగాలకు పాల్పడవద్దని కోరారు. బాధితుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శంకర్ గౌడ్ మృతిని 'ప్రభుత్వ హత్య'గా అభివర్ణిస్తూ బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆందోళనలు చేపట్టారు. బాధితుడి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కార్మిక సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించడంలో జాప్యం జరగడం వల్ల ఇలాంటి విషాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వం జేఏసీ (JAC) నేతలతో చర్చలు జరిపి తక్షణ పరిష్కారం చూపాల్సిన బాధ్యత ఉంది. మరోవైపు రైతుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినప్పటికీ, క్షేత్రస్థాయిలో సమస్యలు కొనసాగుతున్నాయి. రైతులు తమ పంటను మార్కెట్ ధర ఉన్నప్పుడే అమ్ముకునేలా సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రైతు భరోసా, ఇతర బకాయిలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియ వేగవంతం చేస్తామని ప్రభుత్వం హామీ ఇస్తోంది. అలాగే రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. ప్రధాన పార్టీల మధ్య విమర్శల డోసు పెరిగింది. ఇతర పార్టీల నాయకులు అధికార లేదా బలపడుతున్న పార్టీల వైపు మొగ్గు చూపుతుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు ప్రారంభమయ్యాయి. గ్రామ పంచాయతీల్లో నామినేటెడ్ పాలకవర్గాల నియమకానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. అయితే, కుల గణన, రిజర్వేషన్ల అంశంపై విపక్షాలు కోర్టులను ఆశ్రయించడం పాలనాపరమైన సందిగ్ధతను కలిగిస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి పనుల ద్వారా నిఘాను పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. మరోవైపు వేసవి నేపథ్యంలో ఇంధన కొరత లేకుండా చర్యలు తీసుకోవడం, విద్యార్థులకు సెలవులు ప్రకటించడం వంటి అంశాలు ప్రజలకు కొంత ఉపశమనాన్ని ఇస్తున్నాయి. తెలంగాణ అభివృద్ధి పథంలో సాగాలంటే కేవలం భౌతిక వనరుల కల్పన మాత్రమే సరిపోదు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఒక కార్మికుడు ఆత్మబలిదానం ఇచ్చాకే స్పందించడం ప్రభుత్వానికి కొంత మేర నష్టమే. అటుగా ముఖ్యమంత్రే స్వయంగా పరిష్కరించాల్సిన సమ్మె ఉప ముఖ్యమంత్రికి అప్పజెప్పడం పరోక్షంగా ఉప ముఖ్యమంత్రి మంచి పేరు తెచ్చిపెట్టింది. అప్పటికే విద్యుత్ ఆర్టీజియన్ల సమ్మె పరిష్కారంలో కేవలం హామీతోనే భట్టి సమ్మె అపారని ప్రభుత్వ వర్గాల్లో గొప్ప మార్కులే వేయించుకున్నారు. ఆలా ప్రభుత్వ పక్షాన బట్టీ పెద్దన్నగా నిలిచి సమస్య ఏదైనా తన వద్ద పరిష్కారం ఉందని నిరూపించారు. ఇది ప్రభుత్వానికి పెద్ద ఉపశమనం.

# మలేరియా రహిత సమాజమే లక్ష్యం

**గుడిహత్నూర్ సిరి న్యూస్:** మలేరియా మహమ్మారిని పూర్తిగా తరిమికొట్టి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని గుడిహత్నూర్ గ్రామ సర్పంచ్ ఆడే శీల పిలుపునిచ్చారు. 'ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని' పురస్కరించుకొని గుడిహత్నూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2030 నాటికి దేశం నుంచి మలేరియాను పూర్తిగా నిర్మూలించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. పరిసరాల పరిశుభ్రత, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని నియంత్రించవచ్చని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, నర్సులు, ఆశా వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంబలి పంపిణీ



**ఆసిఫాబాద్ టౌన్ సిరి న్యూస్:** జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద యూ బీ వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అంబలి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి అసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా బిన్ అహ్మద్ ప్రారంభించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉబెద్ బిన్ యహియా (తారిఖ్) ఆధ్వర్యంలో గత పదేళ్లుగా వేసవిలో ఈ కార్యక్రమం నిర్వహిస్తుండటం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఎండల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు అబ్దుల్ ముబషీర్, ఫైసల్, మెహెరాజ్ తదితరులు పాల్గొన్నారు.

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.